

# ఆంగ్ల నూతన సంవత్సర
# మరియు
# సంక్రాంతి
# శుభాకాంక్షలు

హాస్యానందం



తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

జనవరి-2023

వెల: రూ.20




శ్రీ గుదిబండి వెంకటరెడ్డి
నిర్వహించిన
కార్టూన్ పోటీ ఫలితాలు

శ్రీ కొయిలాడ వెంకునాయుడు
స్మారక
ఉత్తరాల పోటీ ఫలితాలు

శ్రీ పూటుకూరి సుబ్బారావు స్మారక
'చక్కెరకేళి' S.M.S
పోటీ ఫలితాలు

శ్రీమతి గుళ్ళపల్లి అరుణకుమారి
స్మారక
కార్టూన్ పోటీ ఫలితాలు



# బాపురమణల అవార్డు ప్రదానోత్సవం 2022



బాపు పురస్కారం-2022
అందుకుంటున్న
ప్రఖ్యాత కార్టూనిస్టు, క్యారికేచరిస్టు
శ్రీ శంకర్‌గారు.



రమణ పురస్కారం-2022
అందుకుంటున్న
ప్రఖ్యాత హాస్య రచయిత్రి
శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి



బాపు రమణ
మధుర స్నేహ పురస్కారం-2022
అందుకున్న
డా॥ గురవారెడ్డి,
డా॥ రొంపిచర్ల భార్గవి గార్లు.

వివరాలు 41వ పేజీలో

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

# హాస్యానందం

**జనవరి-2023**

**20వ సంవత్సరం**

**223 వ సంచిక**

ఆనందానికి
ఆధారం నవ్వు!

*Publisher& Editor-*
*Ramu. P*

*Full Pillar* :
Bnim

*Cartoon Feature Editor*:
Bachi

*D.T.P:*
P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, (I.A.S.Retd)
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy

*Prize Sponsers*
G.Venkat Reddy,
Dr. Rama Kumar
Padmadas
Koilada Babu

*Creative Team*
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Dayakar
Sangram
Krishna
Bomman
GopalKrishna
Venkat
Ramsheshu



ముఖచిత్రం:
రాశీఖన్నా

కార్టూన్:కృష్ణ

సంవత్సర చందా-రూ.300/-
(పోస్టల్ చార్జీలతో)

2 సంవత్సరాల చందా-రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)

**జీవిత చందా- రూ.5000/-లు**

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**

email:
**hasyanandam.mag@gmail.com**
web:
**www. hasyanandam.com**


**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad.
Cell. 9666680857.

**గమనిక:**

ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

**ఆనందానికి కారణం- నవ్వు!... నవ్వుకి కారణం హాస్యానందం!**

## ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...




### కథలు...


| | | |
|---|---|---|
| ఎవరికి తెలుసు? | -మేడా మస్తాన్ రెడ్డి | -24 |
| సభకో నమస్కారం | -కిరణ్ కుమార్ సత్యవోలు | -30 |
| లెఫ్ట్ ఈజ్ రైట్ | -కె.వి.సుమలత | -36 |
| ఇంటి పేర్లు తెచ్చిన తంటాలు | -డా. కేతవరపు రాజ్యశ్రీ | -42 |


### శీర్షికలు


| | | |
|---|---|---|
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -8 |
| ఫన్‌పంచ్ | -గుండు సుదర్శన్ | -26 |
| బాలి కార్టూన్‌కి క్యాప్షన్ | | -39 |
| తర్కారావు కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -45 |


### స్పెషల్స్


| | | |
|---|---|---|
| కొత్త సంవత్సరంలోసంక్రాంతి సరదాలు | | -23 |
| కళ్ళజోడు | -దయాకర్ | -33 |
| బాపురమణ పురస్కారం-2022 ప్రదానోత్సవం | | -41 |


### సీరియల్


| | | |
|---|---|---|
| ఇందు చందు-నవ్వులవిందు | -కండ్లకుంట శరత్‌చంద్ర | -46 |


### కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -9 |
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -15 |
| నవ్వేమందు | -ప్రసిద్ధ | -19 |
| నవ్వే ఆనందం | -గోపాలకృష్ణ | -32 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -38 |
| కార్టూన్ బరస్ట్ | -వడ్డేపల్లి వెంకటేష్ | -40 |
| ఏడువారాల నవ్వులు | -అరుణ్ | -40 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -44 |
| దెయ్యాల గోల | -ఎన్.పి.ఎస్.రావు | -48 |
| భలేబాస్ | -బొమ్మన్ | -49 |


### ఈ సంచికలో కార్టూనిస్టులు

| | | | |
|---|---|---|---|
| ✦ జయదేవ్ | ✦ రామ్‌శేషు | ✦ టి.భాస్కర్ | ✦ సునీల్ |
| ✦ సరసి | ✦ దయాకర్ | ✦ డా॥ రావెళ్ళ | ✦ ఆనంద్‌గుడి |
| ✦ ఎవీఎమ్ | ✦ వడ్డేపల్లి వెంకటేష్ | ✦ దొరశ్రీ | ✦ తోపల్లి ఆనంద్ |
| ✦ గోపాలకృష్ణ | ✦ డా॥పూతేటి | ✦ శర్మ | ✦ గౌతమ్ |
| ✦ కృష్ణ | ✦ నాగిశెట్టి | ✦ టి.ఆర్.బాబు | ✦ రంగాచారి |
| ✦ లేపాక్షి | ✦ డి.శంకర్ | ✦ ఎన్.ధీరజ | ✦ మణి |
| ✦ గాంధి | ✦ బొమ్మన్ | ✦ శంబంగి | ✦ కన్నాజిరావు |
| ✦ ప్రసిద్ధ | ✦ జె.ఎన్నెమ్ | ✦ శేఖర్ | ✦ ఎన్.పి.ఎస్.రావు |
| ✦ అరుణ్ | ✦ చక్రవర్తి | ✦ కాజప్రసాద్ | ✦ జ్యోతిర్మయి |

## హాయ్...సానందంగా...



**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... హాస్యప్రియులకు,**
**సన్నిహితులకు ఆంగ్ల నూతన సంవత్సర&**
**సంక్రాంతి శుభాకాంక్షలు!**

**నో**రు మంచిదైతే ఊరు మంచిదౌతుందని సామెత! ఇప్పుడెంతమంది పాటిస్తున్నారీ సామెతని! ఇప్పుడు మన ఆలోచనా పరిధి పెరిగింది. ధోరణీ మారింది. కాని ఆ 'పరిధి' ఎంత వరకనే విషయం మాత్రం గమనించట్లేదు. 'ఎవరేమనుకుంటే నాకేం! అన్న ధోరణి పెరిగిపోయింది. నేనేమైనా ఎవరిమీదైనా ఆధారపడి బతుకుతున్నానా?' అనే 'డిఫెన్స్' మాటలతో ఎదుటి వాళ్ళను బాధ పెడుతూ సాగే నేటితరం ఆలోచనా ధోరణి వలన కలిగే మనస్తాపం తన దాక వస్తే గాని తెలియదు. ఇక రెండోరకం... అందరితో మంచి అనిపించుకోవాలని కిందా మీదా పడుతుంటారు. ఆ క్రమంలో ఎవరి దగ్గరుంటే వాళ్ళకి వత్తాసు పలుకుతూ ఎదుటివాళ్ళను చులకన చేసి మాట్లాడుతూ కాలం గడుపుతుంటారు! వాస్తవంగా అందరినీ మెప్పించటం చాలా కష్టం! కానీ ఏవో ప్రయోజనాల కోసం గోడమీది పిల్లి వాటంలా ప్రవర్తించే వీరు 'తీయని' మాటలతో అనుకున్నది చేయడం కోసం ఎంతకైనా తెగిస్తారు. ఈ రెండు రకాల మనుషులను గమనిస్తూ మనమెలా ఉండాలో నిర్ణయం తీసుకుందాం! మనం సంఘజీవులం. నా బ్రతుకు నా ఇష్టం అని బ్రతికేయలేము. ఈ రోజు ఎదుటివాళ్ళ అవసరానికి మనం ఉపయోగ పడ్తే... రేపు మన అవసరానికి వాళ్ళు నిల్చుంటారు. ఇవన్నీ మన సమాజంలో ఏర్పడిన పరస్పర అవగాహనలు. ఇందులో ఎవరి వలన ఎవరూ బ్రతకరు... ఎవరూ ఎవరినీ పోషించరు. జస్ట్ మనకంటూ ఆప్తులు, సన్నిహితులున్నారనే ధైర్యం... అంతే! ఈ రోజు మనదే!... మరి రేపటి పరిస్థితి?... కాస్త ఆలోచిద్దాం!...

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా
ఉండాలని కోరుకుంటూ.....









✦ **ఎమ్.ఆర్.కె.మూర్తి, భువనేశ్వర్**

**డి**శంబర్ హాస్యానందం రచయిత 'కోనే' ప్రత్యేక సంచిక బాగుంది.. ఆయన కథలు అక్కడక్కడ చదివాను... కాని ఈ సంచికలో ఆయన గురించి పూర్తిగా తెలుసుకున్నాను. ఒక రచయితకు ప్రాధాన్యతనిచ్చి ఇలా సమగ్రంగా ఒక సంచిక రూపొందించటం నాకు తెలిసి ఒక్క హాస్యానందానికే చెల్లింది! మీకు అభినందనలు. కోనేగారికి శుభాకాంక్షలు!



✦ **పి.వి.హైమావతి, నెల్లూరు**

**డి**శంబర్ హాస్యానందం కథలతో నిండుగా ఉండి, అలరించింది. కోనేగారి చిన్న చిన్న కథలు, హాస్యకథలు ఎలా ఉండాలో తెలియజేసాయి. ఈ ప్రత్యేక సంచిక కోనేగారికి 2022లో ఓ గొప్ప కానుకగా నిలిచి పోతుంది. మీ కృషికి అభినందనలు.

✦ **ఆర్.భావన,హైదరాబాద్**

**హా**స్యానందం ప్రత్యేక సంచికలు రూపొందించటంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించిందంటే అతిశయోక్తి కాదు! మన కార్టూనిస్టుల, రచయితల ప్రతిభా పాటవాలను పాఠకులకు ఏమాత్రం విసిగించకుండా మీరందిస్తున్న తీరు అభినందనీయం. ఎందుకంటే ఒక వ్యక్తి గురించి ప్రత్యేక సంచిక అంటే సావనీర్‌లా కాకుండా పాఠకరంజకంగా రూపొందిస్తున్న తీరు మీ శ్రద్ధకు నిదర్శనం! ఇదే హాస్యానందం విజయానికి కారణం!

✦ **శ్రీహర్ష పారుపల్లి, తిరుపతి**


**డి**శంబర్,2022 హాస్యానందం సంచిక చాలా బావుండి మమ్మల్ని ఆకట్టుకుంది. సానందంగా ఎడిటర్‌గారు-'ఎదుటివాళ్ళ సక్సెస్ నుంచి మనం చాలా నేర్చుకోవాలి' అన్న మాటలు అక్షర సత్యాలు! అయితే ఆ కారణంగా సక్సెస్ అయిన కోనేగారి ప్రత్యేక సంచిక నిజంగా ఓ అపురూపమైన సంచిక! భువన్‌గారు చేసిన ఇంటర్వ్యూ కోనేగారి అంతరంగాన్ని పూర్తిగా ఆవిష్కరించింది. హాస్యానందం చేసే ప్రతి ప్రయోగం పాఠకులను అలరిస్తుందనే దానికి ఏమాత్రం సందేహం లేదు! కేవలం ఇరవై రూపాయలకు వందరెట్ల నవ్వులు పంచుతున్న ఏకైక పత్రిక అని చెప్పటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. 2023వ సంవత్సరంలో హాస్యానందం మరెందరో పాఠకుల అభిమానం చురగొనాలని, మరింత విజయపథంలో దూసుకెళ్ళాలని మనసారా కోరుకుంటున్నాను.

✦ **విజయకుమార్.జి., బెంగళూరు**

**డి**శంబర్ హాస్యానందం కోనే నాగవెంకట ఆంజనేయులుగారి ప్రత్యేక సంచిక చాలా బాగుంది. ముఖచిత్రం మీద, ప్రపంచాన్ని ఆయన కలంతో నవ్విస్తున్న డ్రాయింగ్ ఆయన ప్రతిభని ఒక్క బొమ్మలో గొప్పగా చూపించారు. ఈ సంచికలో ప్రచురించిన కథలన్నీ నవ్వించాయి. కోనేగారికి అభినందనలు! అలాగే ప్రతినెలా ఏదో ఒక పోటీ పెడుతూ రచయితలకు, కార్టూనిస్టులకు చేతినిండా పని కల్పిస్తున్న హాస్యానందానికి కృతజ్ఞతాభినందనలు!







సంక్రాంతి సరదాలు
పండగ పిండివంటలు చాలా బాగున్నాయి..సార్.. నా వైఫ్‌కి, పిల్లలకు ఇవంటే చాలా ఇష్టం.. కొన్ని పేక్ చేస్తారా..ఇంటికి పట్టుకెళ్తా..! హిహిహిహిహి.....
కర్ర..కర్ర.. కర్ర..
ఇప్పుడేమన్నానని నీ మనోభావాలు దెబ్బతినడానికి.... సంక్రాంతి కదా త్వరగా లేచి ముగ్గు వేయమన్నానంతేగా—
ఈ చలిలో ఇది తోడు లేకుండా ముగ్గు వేయాలా..! ఏం.. నన్ను చంపేద్దామనా.. అంటూ..!
ఎదురింటాయన, పక్కింటాయన వాళ్లింటి ముందు ముగ్గు వేస్తుండగా... నేను మనింటి ముందు ముగ్గు వేస్తే... పాపం.. వాళ్లు ఫీలవుతారండి... కాబట్టి మీరెళ్లి ముగ్గు వేయండి..!

# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## బూమ 'రాంగ్'

ఎరికైనా మనం పని కట్టుకుని హాని చేయాలని చూస్తే అది వాళ్ళ పాలిట మంచి కార్యంగా క్రియేట్ ఐతే అంతకంటే బాధా కరమైన విషయం ఏముంటుంది చెప్పండి.?

విలన్ లాంటి బాపినీడు చేసిన పనితో సత్యమూర్తి, సావిత్రిల కూతురు పవిత్రకు ఇలాగే జరిగింది.

✦✦✦

సత్యమూర్తి, సావిత్రిల కూతురు పవిత్ర. పేరుకు తగ్గట్టే ఆర్గానిక్ లక్షణాలు వున్న అమ్మాయి. బాగా చదువు కుంది. ఈ స్మార్ట్ ఫోన్ యుగంలో కూడా ఇలాంటి అమ్మాయి వుందం టే ఎవరూ నమ్మరు. ఈ మ్యాటర్ పక్కన పెడితే....

బాపినీడు ఎవరో కాదు. సావిత్రి వాళ్ళ అన్నయ్య. ఇతగాడికి కిట్టు అనే సుపుత్రుడు వున్నాడు. వాడికి బోలెడు చెడు అలవాట్లు వున్నాయి. అయినా సిగ్గు లేకుండా పవిత్రను తన కొడుక్కి ఇచ్చి పెళ్లి చేయమని అడిగాడు బాపినీడు.

దానికి సావిత్రి, సత్యమూర్తి 'బిగ్ సారీ' అన్నారు.

దీన్ని చాలా అవమానంగా ఫీల్ అయ్యాడు బాపినీడు.

ఇంతలో పవిత్రకి పెళ్లి నిశ్చయమైంది.


పెళ్లి కొడుకు పేరు రాంబాబు. టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అమ్మాయిల కరువు వున్న ఈ రోజుల్లో పవిత్రను పెళ్లి చేసుకోడానికి చాలా మంది అబ్బాయిలు వెయిటింగ్ లిస్ట్ వున్నారు. అయినా టీచర్‌గా వున్న రాంబాబుకి సత్యమూర్తి తన కూతుర్ని ఇచ్చి ఎందుకు పెళ్లి చేయలనుకున్నాడో బాపినీడుకి అర్థం కాలేదు.

రాంబాబు డబ్బుకు ఈజీగా అమ్ముడు పోయే రకమని బాపినీడు విశ్వాసనీయవర్గాల ద్వారా తెల్సుకున్నాడు.

ఇక తెల్లవారితే పెళ్లి అనగా బాపినీడు వెళ్లి రాంబాబు ని మర్యాద పూర్వకంగా కలిశాడు.

"మీ మామయ్య నీకు కట్నం ఎంత ఇస్తాన న్నాడు?" రాంబాబుని బాపినీడు అడిగాడు.

"ఏమీ లేదు! అమ్మాయి అందం నచ్చి పెళ్లి చేసుకుంటున్నా!" అన్నాడు రాంబాబు.




"నువ్వు తప్పు చేస్తున్నావ్... అందం పర్మినెంట్ కాదు. నీలా గవర్నమెంట్ ఉద్యోగం వుంటే కోట్ల కట్నం ఇచ్చేవాళ్ళు మన తెలుగు రాష్ట్రాల్లో చాలామంది వున్నారు." అని మోటివేషన్ క్లాస్ తీసుకున్నాడు.

దాంతో రాంబాబు... టోటల్‌గా మారి పోయాడు.

"నీకు నేను పాతిక లక్షలు ఇస్తాను... ఓ వెధవ పని చేస్తావా?" అడిగాడు బాపినీడు.

"పాతిక లక్షలు అంటున్నారుగా.. ఏంటో చెప్పండి" ఆత్రుతగా అడిగాడు రాంబాబు..

"రేపు పెళ్లిలో నువ్వు పవిత్రకు తాళి కట్ట కుండా పెళ్లి పీటల మీద నుండి లేచి వెళ్ళి పోతూ... 'మీ అమ్మాయికి బాపినీడు కొడుకు కిట్టూ అనే వాడితో అక్రమ సంబంధం వుందని నాకు తెల్సింది. అంచేత నాకీ పెళ్లి ఇష్టం లేదు' అని వెళ్లిపోవాలి." అని అన్నాడు బాపినీడు.

"పాతిక లక్షలు ఏదీ?"అడిగాడు రాంబాబు.

సిగ్గులేని బాపినీడు ఇచ్చాడు...నీతిలేని రాంబాబు తీసుకున్నాడు.

బాపినీడు వెళ్లబోతుంటే...

"ఔటాఫ్ క్యూరియాసిటీతో అడుగుతున్నా... ఎందుకీ ఈ కుట్ర?' అని డబ్బు బ్యాగులో పెట్టుకుంటూ అడిగాడు రాంబాబు.

సత్యమూర్తి, సావిత్రిలకు ఏకైక కూతురు పవిత్ర. కోట్ల ఆస్తివుంది. పవిత్రను నా కొడుకు పెళ్లి చేసుకుంటే కోట్ల ఆస్తికి వారసుదు అవు తాడు. అని అసలు విషయం చెప్పకుండా...

"పవిత్రను నా కొడుకు దారుణంగా ప్రేమించాడు... కానీ నా కొడుక్కి ఉద్యోగం లేదని పవిత్రను ఇచ్చి పెళ్లి చేయడం ఇష్టం లేదు అన్నారు." అని... నమ్మబుల్ అబద్ధం చెప్పి అక్కడినుండి వెళ్ళి పోయాడు బాపినీడు.

రేపు జరగబోయే పవిత్ర పెళ్లిలో ఏం జరుగుతుందో ఊహించుకుంటూ... ఆనందంగా ఇంటికి చేరాడు బాపి నీడు.

✦✦✦

పవిత్ర, రాంబాబుల పెళ్లి జరుగు తోంది...

తాళి కట్టే సమయం ఆసన్నమైంది.

ఇంతలో రాంబాబు లేచి–

"పెళ్లి కూతురికి కిట్టు అనే వాడితో అక్రమ సంబంధం వుందని నాకు ఇప్పుడే తెల్సింది... నాకీ పెళ్లి ఇష్టం లేదు!" అని తాళి పడేసి... అక్కడి నుండి వెళ్లి పోతుంటే... మండపంలో వున్న బాపినీడు పరుగున వచ్చి రాంబాబు కాళ్ళు పట్టుకుని–

"బాబూ!...నా కొడుకు అంటే గిట్టని వాళ్ళు ఎవరో నీకు చెప్పినట్టు వున్నారు. పవిత్ర కూడా అలాంటిది కాదు... నువ్విలా నింద వేసి వెళ్ళి పోతే ఆ అమ్మాయిని ఎవరూ పెళ్లి చేసుకోరు ప్లీజ్!" అని ఆస్కార్ అవార్డ్‌కు ఆస్కారం వున్న నటుడిలా జీవించాడు బాపినీడు.

బాపినీడు చెప్పిన ప్లాన్ ప్రకారం రాంబాబు

కళ్యాణ మండపం నుండి వెళ్ళిపోయాడు.

పెళ్లి పీటల మీద వున్న పవిత్ర ఏడుస్తూ ఉండి పోయింది.

తమ కూతురి దుస్థితి చూసిన సత్యమూర్తి, సావిత్రి భోరున ఏడ్చేశారు.

ఈ సీన్ చూస్తున్న కిట్టు, బాపినీడు తమ ఆనందాన్ని బయటికి కనిపించకుండా తెగ ప్రయత్నం చేస్తున్నారు.

అయిందేదో అయింది... అని పవిత్ర మెళ్ళో కిట్టూని తాళి కట్టమని సత్యమూర్తి బతిమలాడుకుంటా డని బాపినీడు, కిట్టు ఎదురు చూస్తూ వున్నారు.

ఇంతలో అదే మండపంలో వున్న దిలీప్ అనే డాక్టర్–

"సత్యమూర్తిగారు! మీ అమ్మాయి అంటే నాకు ఇష్టం. మీకూ మీ అమ్మాయికి ఇష్టమైతే చెప్పండి. నేను పవిత్రను పెళ్లి చేసుకుంటాను!" అని అన్నాడు.

దిలీప్‌ని పెళ్లి చేసుకోవడం తనకీ ఇష్టమని పవిత్ర చెప్పడంతో మంచి అల్లుడు దొరికినందుకు సత్య మూర్తి, సావిత్రి హ్యాపీగా ఫీల్ అయ్యారు.

ఆస్తి, అందంతో పాటు డాక్టర్ ఉద్యోగం వున్నవాడు పవిత్రకు భర్తగా రావడం బాపినీడు డైజెస్ట్ చేసుకో లేకేమో కిట్టు మీదే వాంతి చేసుకున్నాడు.

పవిత్ర, దిలీప్‌ల పెళ్లి అంగరంగ వైభవంగా జరి గింది.

వామ్టింగ్ మీద వామ్టింగ్ చేసుకుంటున్న బాపి నీడుకి ఫుడ్ పాయిజన్ అయిందని హాస్పిటల్ వాళ్ళు చెప్పి, ట్రీట్‌మెంట్ ఇచ్చి, కేవలం యాభై వేలు లాక్కొని పంపేశారు.

ఇంటికి వచ్చిన బాపినీడుకి రాంబాబుకు ఇచ్చిన పాతిక లక్షలు ఇక తిరిగి రావని తెల్సి ఒళ్ళంతా చల్లబడి పోవడంతో మళ్ళీ హాస్పి టల్ కు తరలించారు.


పవిత్ర తనకి దక్కలేదన్న బాధలో క్లబ్బు కెళ్ళి కిట్టు మందు తాగుతూ, పేకాట ఆడుతూ ఉండిపోయాడు.

దిలీప్, పవిత్ర హానీమూన్ వెళ్తూ హాస్పిటల్లో వున్న బాపినీడుని పరా మర్శించి వెళ్ళారు.


ఆ తర్వాత బాపినీడు ఆరోగ్యం మరింత క్షీణించింది.


**కార్టూనిస్ట్ రామకృష్ణ ఫౌండేషన్ సమర్పణలో**
**హాస్యానందం ప్రచురించిన**
**నవ్వుల విందు-రాగతి పండరి కార్టూన్ల పుస్తకం**
**డిశంబర్,15న హైదరాబాద్, తెలుగు యూనివర్శిటీలో**
**విడుదలైంది.**





ఈ పుస్తకం
కావలసినవారు
**9849630637** నెంబరుకి
**125 రూపాయలు**
(పోస్టల్ చార్జీలతో)
గూగుల్ పే / ఫోన్‌పే చేసి వాట్సాప్‌లో
మీ అడ్రస్ పంపండి.

# హాస్యానందం సౌజన్యంతో శ్రీ గుదిబండి వెంకట రెడ్డి నిర్వహించిన కార్టూన్ పోటీ ఫలితాలు





## న్యాయనిర్ణేత మాట!

ప్రతి నెల హాస్యానందం నిర్వహిస్తున్న పోటీల వల్ల కార్టూనిస్టుల్లో పోటీతత్వం పెరిగిన మాట వాస్తవం.

అలాగే కార్టూన్‌ల్లో కూడా క్వాలిటీ పెరగాలి... ఏవో నాలుగు రాళ్లు విసిరితే ఒకటన్న తగలక పోతుందా అనే ఆలోచన పోవాలి... ఈ కార్టూన్‌కు బహుమతి తప్పకుండా వస్తుంది అని మనసారా నమ్మిన వాటినే పోటీలకు పంపాలి.

చెట్లు నరకడం, వృద్ధాశ్రమాలు, కులాలు వంటి అంశాలు కార్టూన్లకు పనికిరావు అని ఎవరు అనరు... అయితే ఆ అంశాల మీద వైవిధ్యభరితమైన ఆలోచనలు కొరవడుతున్నాయి. కొత్తగా ఆలోచిద్దాం.

ఇన్ని మంచి కార్టూనుల్లో పది కార్టూనుల్ని ఎంపిక చేయడం ఎలా?... అనే పరిస్థితి జడ్జీలకు వచ్చే రోజు రావాలి!


బహుమతి రానంత మాత్రాన నిరుత్సాహ పడాల్సిన పనిలేదు. ఎన్నో అవకాశాలు ముందు ఉన్నాయి.

గుదిబండి వెంకటరెడ్డిగారు నేను సచివాలయ పూర్వ ఉద్యోగులం. కళాకారులను ప్రోత్సహించడం ఆయనకున్న బలహీనత. కార్టూనిస్టుల తరఫున వారికి కృతజ్ఞతలు.


-సరసి.

**న్యాయ నిర్ణేత- శ్రీ సరసి**


**మొదటి బహుమతి రూ.3,000/-లు గెలుపొందిన కార్టూన్**





**రెండవ బహుమతి రూ.2,000/-లు గెలుపొందిన కార్టూన్**




## 5 ప్రత్యేక బహుమతులు పొందిన కార్టూన్లు. ఒకో కార్టూన్‌కి రూ.1,000/-లు నగదు బహుమతి








శ్రీ గుడిబండి వెంకటరెడ్డిగారు మన కార్టూనిస్టులను ప్రోత్సాహించేందుకు నిర్వహించిన ఈ కార్టూన్ పోటీలో పాల్గొన్న కార్టూనిస్ట్‌లకు అభినందనలు, బహుమతి పొందిన కార్టూనిస్టులకు శుభాకాంక్షలు! -ఎడిటర్

### ఆహ్వానము

**కార్టూన్ పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ**

**22-01-2023, ఆదివారం**
**ఉదయం10గంటలకు**

శ్రీ కె.వి.రమణాచారిగారి
క్యాంపుకార్యాలయం, ఎ.సి.గార్డ్స్,
ఇన్‌కం టాక్స్ టవర్ దగ్గర,
మసాబ్‌టాంక్,
హైదరాబాద్‌లో జరుగును




**హాస్యానందం సౌజన్యంతో శ్రీబాబు కొయిలాడ గారు, తమ తండ్రి శ్రీకొయిలాడ వెంకునాయుడు గారి పేరిట నిర్వహించిన ఉత్తరాల పోటీ ఫలితాలు.**



హాస్యానందం పాఠకులకు సాదర సమస్సులు,

నేటి సైబర్ యుగంలో ఒకరికొకరం ఉత్తరాలు వ్రాసుకొనే అలవాటు దాదాపుగా తగ్గిపోయింది. అందరూ వాట్సాప్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారానే సందేశాలు పంపుతున్నారు. కానీ ఓ ఇరవై సంవత్సరాల క్రితం వరకు చాలా కొత్త స్నేహాలు ఉత్తరాల ద్వారానే ప్రారంభమయ్యేవి. నా వరకు నేను కాలేజీ రోజుల్లో ఎందరో వ్యక్తులతో కలంస్నేహం చేసాను. 'కలం స్నేహం' ద్వారా మన దేశం నుండే కాకుండా, దేశ విదేశాల నుండి కూడా ఎందరో మిత్రులను సంపాదించుకున్నాను.

నెల్లూరుకి చెందిన ప్రముఖ కవి, రచయిత శ్రీమోపూరి పెంచల నరసింహంగారు నేను ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు 'కలం స్నేహం' ద్వారానే నాకు మిత్రుడిగా పరిచయం అయ్యారు. అలాగే ఇటలీకి చెందిన ఓ లేడి ప్రొఫెసర్ చాలా సంవత్సరాలు నాతో పోస్టల్ ఉత్తరాల ద్వారానే కరస్పాండెన్స్ చేసేవారు. నాకోసం నా పెన్ ఫ్రెండ్స్ వ్రాసిన ఎన్నో ఉత్తరాలను మా నాన్నగారికి చదివి వినిపించేవాడిని. మేమిద్దరము మాకు చేరిన ఉత్తరాలపై కొంత విశ్లేషణ కూడా చేసే వాళ్ళం. మా నాన్నగారు నా ఈ హాబీని ఎంతో ప్రోత్సహించేవారు.

అందుకే మా నాన్నగారి ద్వితీయ వర్థంతి సందర్భంగా ఆయన పేరిట హాస్యానందం వారి సౌజన్యంతో **'కొయిలాడ వెంకునాయుడు స్మారక హాస్య లేఖల పోటీ'** ని నిర్వహించడానికి సంకల్పించడం జరిగింది. ఆయన ప్రథమ వర్థంతి సందర్భంగా కూడా హాస్యానందం పత్రికలో గత ఏడాది హాస్య కథల పోటీని నిర్వహించాము.

కాగితాన్ని, కలాన్ని ఉపయోగించి ఒక వ్యక్తి కోసం లేదా ఒక సమాచారాన్ని చేరవేయటం కోసం మన దస్తూరితో ఒక లేఖను రాయడంలో ఉన్న ఉత్తేజమే వేరు.... ఆ ఆత్మీయత లేదా ఫీలింగ్ ఈమెయిల్ లేదా వాట్సాప్ మెసేజ్ పంపేటప్పుడు మనకు కలగదు.

'నవ్వుల జాబుకి నజరానా' పేరిట తాజాగా నిర్వహించిన 'ఉత్తరాల పోటీ' కి ఎన్నో అద్భుతమైన, అపురూపమైన లేఖలు వచ్చాయి.

'లేఖాసాహిత్యం' అనే ప్రక్రియను ప్రోత్సహించాల్సిన నేటి తరుణంలో, హాస్యంతో కూడిన లేఖలను వ్రాయడం ఓ కత్తి మీద సాము లాంటి పని. ఎందుకంటే ఎవరి మనసునూ నొప్పించకుండా ఓ వైపు వ్యంగ్య బాణాలు సంధిస్తూనే... మరోవైపు ఛలోక్తులకు కూడా రచనలో ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ పోటీలో పాల్గొన్న రచయితలు అనేక వైవిధ్యమైన అంశాలను తమ లేఖల్లో ప్రస్తావించారు.

అందులో ప్రేయసి ప్రియుడికి వ్రాసిన లేఖలూ ఉన్నాయి. భర్త భార్యకు వ్రాసిన లేఖలూ ఉన్నాయి. అలాగే కొన్ని చిత్ర విచిత్రమైన లేఖలు కూడా మమ్మల్ని ఆశ్చర్యపరిచాయి. ఏదేమైనా తమ అక్షరాలకు హాస్య గుళికలను అద్ది ఉత్తరాలకు మరింత సొగసును తీసుకొచ్చారు ఎందరో రచయితలు.

అయినప్పటికి, ఇది పోటీ కాబట్టి... మాకు వచ్చిన లేఖల్లోని రచయిత సృజనను, చతురతను, రచనా గమనాన్ని నడిపించిన తీరుని కూడా పరిశీలించి విజేతలకు ప్రకటించడం జరిగింది.

హాస్యానందం సౌజన్యంతో ఈ పోటీని నిర్వహించే అవకాశాన్ని నాకు కల్పించిన ఎడిటర్ రాము గారికి నా వేవేల ధన్యవాదాలు.



'నవ్వు నాలుగు విధాల చేటు' అన్నది ఆనాటి నానుడి. 'నవ్వు నాలుగు విధాల గ్రేటు' అనేది ఈనాటి నానుడి.

**–బాబు కొయిలాడ**
(డిప్యూటి ఎడిటర్, పింక్విల్లా సినీ వెబ్ సైట్)

**'నవ్వుల జాబుకి నజరానా'...** హాస్య భరితమైన ఉత్తరానికి బహుమతి! ఈ సరికొత్త ప్రయోగానికి అద్భుతంగా స్పందించిన లేఖకులకు ముందుగా కృతజ్ఞతాపూర్వక అభినందనలు! ఈ పోటీకి సుమారు వంద ఉత్తరాల దాక వచ్చాయి. ఇంచుమించు అన్ని ఉత్తరాలు బావున్నా... వాటిలో వైవిధ్యభరితమైన ఉత్తరాలకి బహుమతులు ఇవ్వడం జరిగాయి.

ఈ పోటీని తమ తండ్రిగారు శ్రీ కొయిలాడ వెంకునాయుడుగారి పేరిట నిర్వహించిన శ్రీబాబు కొయిలాడ గారికి అభినందనలు. విజేతలకు శుభాకాంక్షలు... మరొక్కసారి పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. **–రాము.పి., ఎడిటర్**




**జి.రంగబాబు,**
**9440190669.**

**ఓ** కవి శేఖరా!.... మహానుభావా!.... మార్తాండ తేజా!

నా పై నువ్వు రాసిన కవిత్వానికి ఈ ఉత్తరం నా సమాధానం! నువ్వు రాసిన కవిత్వానికి నాకు నవ్వు, ఏడుపు రెండూ కలిసే వచ్చాయి. ఎండా వానా ఒక్కోసారి కలిసి వస్తూంటాయి కదా అలాగన్న మాట. భార్యనైన నామీద కవిత్వం రాసేంత భావుకత నీలో ఉన్నందుకు సంతోషం... అందులోని అతిశయోక్తులకు దుఃఖం ఒకేసారి రావడం కొసమెరుపు.

మీరు కవులు... దేనికైనా స్పందించగలరు. ఏ విషయం మీదైనా ఇట్టే రాసేయగలరు. కానీ కట్టుకున్నదానిపైన కూడా కవిత్వం రాస్తారని ఇప్పుడే తెలిసింది.


ఏంటి మహానుభావా! నేను నీ ప్రణయ సామ్రాజ్యానికి పట్టపు రాణినా? ఏదీ నీ రాజ్యం?... ఎక్కడ నా సింహాసనం?... ఏదీ నా రాణి వాసం?... వినడానికి ఎంతో సొంపుగా వున్నా కమ్మ కి అమ్మలా ఉంది నీ పొగడ్త!

ఏమిటీ?... ఆకాశాన్ని నా కోసం దించుతావా? ఏదీ దింపు!...అటక పైనున్న నా పెళ్లి నాటి పట్టుచీర పెట్టిన పెట్టె దింపడం చేత కాదు గానీ...

ఏంటీ?... నక్షత్రాలను మాలగా చుట్టి నా మెడలో వేస్తావా? ఎంత బాగా చెప్పావు! బంగారు నెక్లెస్ అడిగినందుకు గోల్డ్ చెయిన్ సంగతి అటుంచు కనీసం ఒన్ గ్రామ్ గోల్డ్ హారమైనా కొని నా బోసి పోయిన మెడకు అలంకరించాలన్న ఆలోచన నీ బోడి (బట్ట) తలకు తట్టలేదు!... నాకెందుకయ్యా... ఆ నక్షత్రాలూ...నెలవంకలూ!

ఏమిటీ?... ఆ రంగు రంగుల ఇంద్ర ధనుస్సుపై నన్ను కూర్చోబెట్టి ఊయల ఊపుతావా?... ఆహా ఏమి సరసం! ఎంత సల్లాపం! ఓ చెక్క బల్ల తెచ్చి ఓ పక్కన కట్టలేక పోయావు. అదే ఊయల అనుకుని ఊగడానికి!... నాకెందుకు బాబూ ఉందో లేదో తెలియని ఆ ఇంద్రధనుస్సును నిజంగా ఎక్కితే నా పని గోవిందా కాదూ!?

ఏమిటేమిటీ? సాక్షాత్తూ కాశీ నుండి గంగను దోసిళ్ళతో పట్టి తెచ్చి నాకు అభిషేకం చేస్తాసా?... పెరట్లో ఉన్న బావిలోనుండి ఏనాడైనా ఒక్క బకెట్ నీళ్లు తోడిపెట్టావా?... అన్ని బిందెల నీళ్లు నేనొక్కదానినే తోడు కుంటుంటే వేడుక చూస్తుంటావు!




నా అందచందాలు గురించి వర్ణిస్తూ పాటలు పాడి నాకే వినిపిస్తానంటావా? ఆహా... ఏమి భాగ్యం! ఇంతవరకూ బాత్‌రూమ్‌లో కూడా ఏ కూనిరాగమూ తీసి ఎరుగవే... ఏకంగా బాలు లాగా పాటలు పాడేస్తావా!? ఎంత విడ్డురం!

నాకోసం అద్దాలమేడ కట్టి అందులో రాకుమారి లాగా కూర్చోబెడతావా?... అద్దాలమేడ సంగతి అటుంచి అద్దె కొంపకు అద్దె కట్టలేక అల్లాడిపోతున్నావు! పడవ లాంటి కారులో నీ ప్రక్కన కూర్చోబెట్టుకుని ఊరంతా తిప్పుతావా? ఆహా! ఎక్కడికి వెళ్లాలన్నా మూడు చక్రాల రిక్షానో, ఆటోనో ఆశ్రయిస్తున్నావు!

నువ్వు ఎంత కవిసామ్రాట్టువైతే మాత్రం నీ కవిత్వంతో నా కడుపు నింపేయాలని చూస్తున్నావా! నువ్వు కలంతో కొడతానంటే అంత కన్నా పదునైన ఆయుధం నా దగ్గర ఉందని మర్చిపోతున్నావు. నేను రోజూ చపాతీలు చేయడం చూస్తున్నావుగా!

మీ తియ్యని మాటలతో నన్ను మునగ చెట్టు ఎక్కించాలని చూడకండి... ముంచేయాలని అనుకోకండి. మీ కవితలు మీ దగ్గరే ఉంచుకోండి మహానుభావా!... నాకేం అక్కరలేదు. నా పేరు ఎంత సుబ్బలక్ష్మి అయితే మాత్రం...

'ఒసేయ్ సుబ్బూ... నువ్వే నా సింథాల్ సబ్బు... నీ సమక్షమే నాకు పయనించే నీలి మబ్బు..." అంటూ గబ్బు నిండే ప్రాసలతో కొడితే నాకు మండదూ!

మీ దిక్కుమాలిన ప్రాసల కోసం లేనివి వున్నట్లు, ఉన్నవి లేనట్లుగా రాయడం భావుకత అనుకుంటున్నావు కదూ...అది కవిత్వం కాదు, కపిత్వం అనిపించుకుంటుంది...

నువ్వు నాకు నగలు... చీరెలు కొనక పోయినా పరవాలేదు. నీ కవిత్వంతో కొట్ట కుండా ఉంటే చాలు. అదే పది వేలు! కాదు... పది లక్షలు!

సెలవా మరి!

నీచే జీలకర్ర, బెల్లం పెట్టించుకున్న నీ సతీమణి... సుబ్బలక్ష్మి!




**గంగాధర్ వడ్లమన్నాటి,**
**9908445969**

**'వి**ంత వాదం' వార పత్రిక సంపాదకులకు నమస్కారములు. నేను మూడు నెలల క్రితం మీ పత్రికకు రిజిస్టర్ పోస్ట్‌లో పంపిన, 'దోషం' అనే కథ మాత్రమే అందిందనీ... దానితో పాటు ధృవీకరణ పత్రం పోయిందనీ, కనుక వెంటనే ధృవీకరణ పత్రం పంపితే, మీ కథ ప్రచురణకు తీసుకోగలం... అంటూ రాసు కొచ్చారు. అయితే నేను కథతో పాటు ధృవీ కరణ పత్రం కూడా జత చేయడం జరిగినది. బహుశ మీరు, అన్ని కథలూ తీసి చదవడంలో, ఆ ధృవీకరణ పత్రం పోయి ఉండవచ్చునని భావించాను... అందుకే మారు ఆలోచించ కుండా వెంటనే నేను మరో ధృవీకరణ పత్రం వ్రాసి, మీ పత్రికకు మరలా పోస్ట్‌లో పంపాను.

అప్పుడు, కథ లేకుండా ధృవీకరణ పత్రం మాత్రమే పంపినట్టు, నాకో కార్డు ముక్క వ్రాసారు. ఇహ ఇలా లాభం లేదని, చిత్తు కాపీ చూసి, కింద మీదా పడి, మొదట్నుండీ మళ్ళీ ఓపిగ్గా కథ మొత్తం సాపు కాపీ వ్రాసి, కథా మరియు ధృవీకరణ పత్రాన్ని మరోసారి మీకు పోస్ట్‌లో పంపాను. అంతా కష్టపడి, స్టాంపు ఖర్చులు భరించి, అన్నిసార్లు మీకు పంపిన తర్వాత, మీ 'దోషం' కథని ప్రచురణకు తీసుకోలేకపోతున్నాం... అని కార్డు ముక్క వ్రాసారు. ఇలా జరిగినందుకు గాను నాకు చాలా కోపం వచ్చింది. ఆ క్షణంలో మిమ్మల్ని నాకొచ్చిన తిట్లు తిట్టుకుని, మనసులో బాగా నొచ్చుకుని,ఆ తర్వాత ఏది జరిగినా మన మంచికే అనుకుని, నాకు నేనే నచ్చజెప్పుకుని ఊరుకున్నాను. ఇదంతా జరిగిన మూడు నెలల తరువాత, ఆ కథని అలా ఊరికే వదిలే యకుండా, ఆ కథనే మరో మారు చక్కగా సాపు కాపీ వ్రాసి, 'గులకరాయి' అనే పత్రిక నిర్వహించిన కథలపోటీకి పంపాను.

నేను కలలోనైనా ఊహించనిది జరిగింది. ఆ పత్రిక వారు నా 'దోషం' కథకి ప్రథమ బహుమతిని ఇచ్చినట్టుగా తెలియజేసారు.

దాంతో నా ఆనందనికి హద్దులు లేకుండా పోయాయి. ఎంతో సంతోషించాను. ఆ విష యమే నా కుటుంబ సభ్యులనుండీ, చుట్టు పక్కల స్నేహితుల వరకూ అందరకీ గొప్పగా చెప్పేసుకున్నాను. కానీ ఆ ఆనందం మీ కార ణంగా కొన్ని గంటల్లోనే... పటాపంచలై పోయింది. కారణం, అదే రోజు మీరు, మీ వార పత్రికలో ఆ 'దోషం' కథని సాధారణ కథగా ప్రచురించినట్టుగా నాకు ఓ కాంప్లి మెంటరీ కాపీ పంపారు.

దాంతో నేను, అసలు ప్రచురణకు స్వీకరిం చలేదని చెప్పిన కథని, మూడు నెలల తర్వాత, మీ వార పత్రికలో ఎలా ప్రచురించార్రా దేవుడో అంటూ జుత్తు పీక్కుని మరీ ఆలోచించాను. కానీ ఏం అర్థం కాలేదు.

ఇహ నా కథకి ప్రథమ బహుమతి ప్రక టించిన ఆ 'గులకరాయి' పత్రిక వారు, నన్ను నానా మాటలూ అని, నానా నీతులూ చెప్పి, ఆ పత్రికకి నా కథలు ఇహ మీదట పంప రాదనీ, పంపినా వేయబోమని కుండబద్దలు కొట్టారు. దాంతో పాటు, రాక రాక నాకొచ్చిన ఆ బహుమతిని రద్దు చెస్తున్నట్టూ, ఆ తర్వాతి కథకి ఆ ప్రథమ బహుమతి ఇస్తున్నట్టూ తర్వాతి సంచికలో ప్రకటన వేసారు.

దాంతో నేను మళ్ళీ మిమ్మల్ని నాకొచ్చిన తిట్లు తిట్టుకున్నాను. అయితే ఆ తిట్లు సరిపో వనీ, నా స్నేహితుల దగ్గర కొన్ని బూతులు నేర్చుకుని మరీ మిమ్మల్ని నా కసి తీరా తిట్టు కున్నాను. ఆ తర్వాత, పొరపాట్లు అనేవి జరుగుతూ ఉంటాయి. అన్నిటికీ మనం మరీ దిగాలు పడిపోకూడదని నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను.

ఆ తర్వాత, మీ వింతవాదం పత్రికలో సాధారణ ప్రచురణ అయిన నా 'దోషం' కథని, ముద్రణలో మనసారా చూసుకుందావని ఎంతో ఆశగా మీ పత్రిక తీసి తిరగేసాను.

అంతే!... ఒక్క క్షణం నా కళ్ళు బైర్లు కమ్మి బుర్ర మొత్తం ఖాళీ అయిపోయింది. మళ్ళీ నా ఆశ అడిఆశ అయింది. కథ మొత్తం నాదే అయినా, వేరే రచయిత పేరుతో వేసేసారు. దాంతో మళ్ళీ నేను నెత్తీ నోరు బాదుకుని, మీరు ఆ కథని నా పేరుతో ప్రచురించాలనీ లేదా కనీసం వచ్చే మీ పత్రికలో అయినా... అది నేను వ్రాసిన కథ అని సవరణ అయినా వేయాలని మీకు ఓ ఉత్తరం ముక్క వ్రాసాను. దాంతో మీరు, గూండాబాబు వ్రాసిన కత్తికో కండ కథని నా కథగా గుర్తించాలని తప్పుగా సవరణ వేసారు.

దాంతో ఆ కథా రచయిత గూండాబాబు, నాకు మరుసటిరోజు పొద్దునే ఫోన్ చేసి, నా కథని నీ కథ అని చెప్పి, పత్రిక వారితో సవ రణ వేయించుకుంటావా అని... నన్ను నానా రకాల నీచమైన తిట్లూ తిట్టాడు. ఇక నాలో ఓపిక నశించి, ఆ విషయాన్ని అక్కడితో వదిలేసాను.

దాంతో ఆ విషయం అంతటితో ముగి సింది. ఏదో బుద్ధి గడ్డి తిని, నేను మీకు పంపిన ఒక్కగానొక్క కథకి, అంతగా నేను క్షోభ అనుభవించవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. చివరికి, మీ పత్రికకు 'దోషం' అనే కథ పంపడమే నా దోషం అని భావించాను. అందుకే, ఆ తర్వాత నేను మీ పత్రికకు ఏ కథా పంపలేదు. ఇక జీవితంలో పంపబోను కూడా. కానీ 'అపరాధం' అనే మీ కథ త్వరలో ప్రచురిస్తాం అని నాకు కార్డు పంపారు.

ఆ కథ నేను మీకు పంపలేదు. ఆ కథ ఎవరిదో తెలుసుకుని, ఆ రచయిత పేరు మీద వేయమని మీకు శతకోటి విన్నపాలు. దయ చేసి నన్ను ఇలా ప్రశాంతంగా బతకనివ్వండి.

శెలవు. ఇట్లు

పిల్లబాబు.




**డా.డి.వి.జి.శంకర రావు,**
**94408 36931**

ప్రియమైన శ్రీవారికి ప్రేమతో నమస్కరించి వ్రాయు లేఖ.

మీ ఉత్తరం అందింది. ఇక్కడంతా క్షేమం. మీ ఆఫీసు పని మీద వెళ్లి, నెల రోజులు గడిచి నందున మరో మూడు రోజుల్లో వచ్చేస్తా నంటూ మీరు రాసిన ఉత్తరంలో విషయాలు చదివి సంతోషించితిని.

అయితే ఇన్ని రోజులూ ఫోన్ గానీ, ఉత్తరం గానీ రాయలేదేమని నాకేమీ చింత లేదు... గాభరా పడడానికి మీ సంగతి నాకు తెలియ కనా?... అందరూ మిమ్మల్ని చాదస్తం అనీ, జిడ్డు అనీ అంటారని తెలిసినా నేనెప్పుడూ మిమ్మల్ని ఆ దృష్టితో చూడలేదు సుమండీ...

మీరు కొంచెం నెమ్మది. అంతే!

కొత్తని వెంటనే అలవాటు చేసుకోరు. నన్ను పెళ్లి చూపులు చూసి, అంతా ఇష్టపడి సరేనని చెప్పడానికి ఒక సంవత్సరం, పెళ్లి చేసుకోడానికి మరో సంవత్సరం తీసుకున్నారు. అప్పుడు మా యింట్లో అంతా కంగారు పడ్డారు కానీ నేను ధీమాగా ఉన్నాను. ఎందుకో తెలుసా!

ఆ రోజు మీరు చక్కగా పక్క పాపిట దువ్వ కుని, బెల్ బాటమ్ ప్యాంటు వేసుకుని వచ్చారు... మీ ఇష్టమైన హీరో పేరు చెప్పమంటే నాగయ్య అన్నారు. హీరోయిన్ కన్నాంబ అన్నారు. మన పెళ్ళిచూపుల టైమ్‌కి బెల్‌బాటమ్ ఫ్యాషన్ అంత రించి పోయి ఉంది. కన్నాంబ, నాగయ్య ముసలి వాళ్ళయి పోయి చిరంజీవి హవా నడుస్తోంది. మీ చూపుల్లో సిగ్గు వల్ల మీకు నేను నచ్చానని... మీరు కొంచెం నెమ్మది అని అర్థమైంది.

అనుకున్నట్టుగానే మన పెళ్లి అయ్యింది.

హనీమూన్‌కి వెళదామని అనుకుంటుండగానే మూడేళ్లు గడిచిపోయాయి. మనం వెళ్ళేటప్పటికి మా చెల్లెళ్ళు పిల్లల్ని ఎత్తుకుని తిరుగుతున్నారు.

పెళ్లయిన పదేళ్లకు బాబు పుట్టాడు. ఎందుకింత లేటుగా పుట్టాడని ఎవ్వరూ ఆశ్చర్య పోలేదు పొర పాటున కూడా. అయితే మీ మీద ఎవరైనా జోకు లేస్తే నాకు పిచ్చ కోపం వస్తుంది.

మొన్న మా ఫ్రెండ్ కాంతం అడుగు తుంది కదా– 'ఏమేవ్! మీ ఆయన దసరా రోజే దసరా చేస్తాడా, లేదా దీపావళికి దసరా చేస్తాడా?' అంటూ.

పక్కనే ఉండి నవ్వుతూ, సుబ్బులు అంటుంది– 'మీ ఆయనని మన ప్రధాని ఎవరని అడిగితే మోడీ అని చెప్పకుండా మన్మోహన్ సింగ్ అంటారట కదా!'

ఇద్దర్నీ చెడామడా తిట్టేశానులెండి.

మీరు నా బంగారం....

చెప్పొద్దూ! లోకమంతా ఫోర్ జీ ఆండ్రా యిడ్ ఫోన్లు నడుస్తున్నప్పుడు మీరు నాకు సర్ప్రైజ్ చేస్తూ కొనిచ్చిన నోకియా బేసిక్ ఫోన్ భలే నచ్చింది.


అందరూ ఓటీటీలూ, వెబ్‌సిరీస్‌లు మాట్లాడుకుంటే... మనం ఎంచక్కా దూర దర్శన్ సీరియల్ చూడడం ఎంత సూపరో! మన అబ్బాయీ మీ పోలికే సుమండీ.

కుర్ కురేలు, నూడుల్స్ ఊసే ఉండదు. ఎంతసేపూ జీళ్లు, కొబ్బరి లౌజులు కావా లంటాడు క్రేజీఫెలో!

అన్నట్టు ఈ ఉత్తరం మీకు చేరే సరికి మీరు మనింటికి బయల్దేరే హడావిడిలో ఉంటారు. తొందరగా వచ్చే యండి కొంచెం ఖర్చయినా ఫర వా లేదు. ఎక్స్‌ప్రెస్ రైలులో రండి. ప్యాసింజర్ రైలు ఎక్కవొద్దు.

అదొచ్చే సరికి పిల్లాడు పెళ్లీడు కొచ్చినా వస్తాడు... మీకోసం ఎదురు చూస్తుం టాను... ఎన్నికల కోసం ప్రతిపక్షంలాగా! ఉంటాను మరి!

ఇట్లు,
మీ శ్రీమతి.






**పి.వి.రామ శర్మ,**
**9490244344**

ఇది ఇప్పటి మాటకాదు.

1980 ప్రాంతాల్లో సుందరానికీ సుబ్బ లక్ష్మికీ పెళ్లి కుదిరిన కొత్తల్లో...పెళ్ళికి ముందు ఉత్తరాలు రాసుకోవడం మా ఆచారం కాదని సుబ్బలక్ష్మి తల్లిదండ్రులు ముందొప్పుకోక పోయినా... కాబోయే ఆవిణ్ణి చూద్దామనే సాకుతో సుందరం వారంవారం కాబోయే మాంగారింటికి వచ్చేస్తుంటే... "ఇది మరీ డేంజర్, ఇలా రాసుకు, పూసుకు తిరిగేకన్నా, ఉత్తరాలు రాసుకోవడమే నయం!" అన్చెప్పి సరే! ఉత్తరాలు రాసుకోండని పెర్మిష నిచ్చేశారు ఇంకో దారి లేక.

ఇహనేం! మొదటి ఉత్తరం సుందరం నుండి రానే వచ్చింది. పోస్ట్‌మాన్ ఆ ఉత్తరం భద్రంగా సుబ్బలక్ష్మి చేతికిచ్చి, "అమ్మా! కవరు బరువె క్కువ, పోస్టల్ స్టాంపులు తక్కువా!" అని పెనాల్టీగా... ఓ రెండు రూపాయలు వసూలు చేశాడు.

సుబ్బలక్ష్మి ఆనందంతో వణుకుతున్న చేతుల్తో కవర్ చించి, లోపలనుండి 4 పేజీల ఉత్తరాన్ని బయటికి తీసి చదవడం మొదలె ట్టింది, ఉత్సాహం, ఉత్సుకతలతో.

నా కాబోయే ప్రియమైన శ్రీమతి రుబ్బు లక్ష్మికి!

"ఇదేంటీ! నన్ను రుబ్బులక్ష్మి అని సంభోదిం చారూ! ఏదో కాస్త ఒళ్లుగా ఉంటానంతేగా!" అనుకుని... ఆ ఏదోలే! కలం రాక్షసం అయ్యుంటుందనుకుని చదవడం మొదలె ట్టింది రుబ్బు.. సారీ!! సుబ్బలక్ష్మి.

ఇదే నా తొలిప్రేమలేఖ! నేనిక్కడ ఓకే! నువ్వక్కడ ఓకేనా? హాయిగా మీ ఇంటికొచ్చి నీ కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడుకునే ఛాన్స్ పోయి... ఇలా పేపర్మీద నా కలం కబుర్లు చెప్పడం కూడా కొత్తగా ఉంది. నిన్న నేను కొత్తగా రిలీజైన కొత్త సిన్మాకి నాకున్న పరపతి ఉపయోగించి టికెట్ సంపాదించి వెళ్ళాను. (వివరాలు 3వపేజీలో)...ఇదేంటీ! ఈ మూడో పేజీ బాగోతం అనుకుంటూ మూడోపేజీలోకి వెళ్లింది సుబ్బలక్ష్మి. ఆ 3వపేజీ చివర్లో ఉన్న 'కొత్త సిన్మా మొదటి పేజీ తరవాయి' అన్న హెడ్డింగ్ కింద చదివింది– నిన్న నేను బొబ్బిలి పులి సిన్మా చూశాను. బహుశా మన పెళ్లి నాటికి ఆ సిన్మా వంద రోజులు దాటిపోతుంది కనుక, అప్పటికి ఇంకా ఉంటుందో ఉండదో అని నేనిప్పుడే చూసేశాను. సిన్మాలో ఎన్.టి. ఆర్.డ్యూయల్ రోల్లో తండ్రి పాత్రలో అదర గొట్టేశాడు. ఇలా సాగిన ఆ సినిమా రివ్యూని చదివి, మళ్ళీ మొదటి పేజీకొచ్చి... చదవసాగింది.... ఇక మన పెళ్ళికి కావల్సిన నా బట్టలు అవీ ఈ రోజే కొని టైలర్ కిచ్చే శాను! లేటయితే వాడు పెళ్లి టైముకివ్వడు కదా! నాతో పాటు మా అమ్మానాన్నగార్లకి, మా చెల్లికి కూడా కొనేశాము.(వివరాలు 2వ పేజీలో)... రెండవ పేజీలోకి వెళ్ళి 'కొత్త బట్టలు మొదటి పేజీ తరవాయి' అన్న హెడ్డింగ్ కింద చదివింది.

నేను ఒక గాబర్డీన్ పాంటు, టెరీవూల్ పాంటు, టెరికాటన్‌లో మూడు షర్టులు, ఒక సఫారీ సూటు తీసుకున్నాను. మా ఆస్థాన... అదే మా వాడుక టైలర్ మస్తాన్‌కి ఇచ్చి పెళ్లి బట్టలు కనుక జాగ్రత్తగా కుట్టమన్నాను. వాడికి శ్రద్ధ కలగాలని పెళ్ళికి పిలుస్తానని చెప్పాను. నాన్నకి, అమ్మకి కూడా.... ఇలా మొదలైన షాపింగ్ హంగామా అంతా చదివి, నవ్వుకుని, మళ్ళీ మొదటిపేజీలోకి వచ్చింది.

మా బాస్‌ని కలిసి మన పెళ్లివిషయం చెప్పి, ముందుగానే లీవ్‌కి అప్లై చేసేశాను. పన్లో పనిగా నా ప్రావిడెంట్ ఫండ్‌లోంచి కొంత అమౌంట్ అడ్వాన్స్‌కి అప్లై చేశాను.(పూర్తి వివరాలు 4వ పేజీలో)... అని సగంలో ఆపే సిన ఆ విషయం 4వపేజీలో 'పెళ్లి–సెలవు' అన్న హెడ్డింగ్ కింద వ్రాసిన మిగతావివరాలు చదివి, మళ్ళీ మొదటిపేజీకొచ్చింది.

ఇలా...మొత్తంనాలుగు పేజీల్లో కొంతకొంత చొప్పున సుందరం, 'తనకు మామగారినుండి రావాల్సిన కట్నంబాకీ గురించి, సుబ్బలక్ష్మికి తాము కొనా(పెట్టా)ల్సిన బంగారం, పట్టుచీర గురించి, తన చెల్లికి రావాల్సిన ఆడపడుచు లాంఛనాల గురించి, హనీమూన్ లాంటి ఓ చిన్నట్రిప్ గురించి ముందువెనుకలుగా చాలా విషయాలతో నాలుగుపేజీలూ నింపేసి.. నీ నుండి మాంఛి బరువైన, బదులుత్తరం కోసం బోల్డంత ఎదురుచూస్తూ..

నీప్రియమైన సుందరం అని వ్రాసి,చివర్లో–

తా.క: (తాజా కలం) అన్నట్టు మరిచా! ఈ ఉత్తరం నీకు మిస్ కాకుండా అందడం కోసం, తక్కువ స్టాంపులు అతికించి పోస్ట్ చేశాను. ఆ పెనాల్టీ డబ్బులు తిట్టుకోకుండా కట్టేసెయ్. మన పెళ్లయ్యాక ఇలాంటి అక్కౌంట్స్ అన్నీ చూసుకుందాం.

ఇంకో విషయం: నిన్ను సంబోధించినప్పుడు రుబ్బులక్ష్మి అని పొరపాటున వ్రాసాను. సుబ్బ లక్ష్మి అని చదువుకోమని మనవి. కలం తప్పుకి చింతిస్తున్నాను. అని ముగించాడు సుందరం.

'హుమ్మ్! ఎలాగైనా ఈ సుందరం గందర గోళం మనిషే. పెళ్లయ్యాక ఓ(తన)దార్లోకి తెచ్చుకోవాలి' అనుకుంటూ...

తిరుగు టపా వెంటనే వ్రాసింది...ఇలా!!

ప్రియమైన కాబోయే శ్రీవారు తొందరం... సారీ సుందరం గారికి,

మీ వార్తాపత్రికా సంపాదకత్వ ఉద్యోగ మోజు(హం)తో వ్రాసిన ఉత్తరం పైకీకిందికీ, వెనక్కీముందుకీ తిప్పితిప్పి చదివాను. ఇంత కన్నా మీరు వారంవారం మా ఇంటికొచ్చి వెళ్తూఉంటే నాప్రాణానికి హాయిగాఉంటుంది. అంతేకానీ, ఈ న్యూస్ పేపరుత్తరాలు నే చదవ లేను. మా నాన్నగారి పెర్మిషన్ తీస్కున్నాను. ఇక మీరు వారంవారం మా ఇంటికి రావచ్చు. స్వాగతం. మిగతా సముఖంలో. ఈ విషయం లో ఉత్తరప్రత్యుత్తరాలకు తావులేదు.!...

ఇట్లు మీ ప్రియమైన కాబోయే

శ్రీమతి సుబ్బలక్ష్మి.




**ఎమ్.విజయ కుమార్,**
**7660091053**

గౌరవనీయులయిన
మా నాయకులు గారికి...

మొన్నీ మధ్య ఒక మీటింగ్‌లో మీ ప్రజలమయిన మేము చాలా బాగున్నామని మీరు చెప్పారు కాబట్టి మేము క్షేమమే... మీరెటూ క్షేమమే! అది తలచుకోవలసిన పనిలేదు. పెరిగే సంపాదన కోసం... తగ్గే ధరల కోసం ఎదురు చూపులు మామూలే. కూరగాయల గాయాలు, పెట్రోలు , డీజిల్ ధరల మంటలు, కరంటు బిల్లు షాకులు మామూలే. మొదట్లో భయపడ్డాము గానీ ఇప్పుడు అలవాటు అయిపోయింది. మగవాళ్ళు బాతాఖానీలోను, బార్ల లోనూ... ఆడవాళ్ళు టీ.వీ సీరియళ్ళ తోనూ బిజీగానే ఉంటున్నారు. పిల్లలు మొబైల్ ఫోన్ వాట్సప్, ఫేస్బుక్, యూ ట్యూబ్ ... మొదలయిన సోషల్ మీడియా చాటింగ్‌లతో పాఠ్య పుస్తకాలు తీసేంత తీరిక లేకుండానే ఉన్నారు. అందరం తెలుగు హిట్ సినిమా డైలాగ్– 'తగ్గేదే.... లే!' అన్నట్లు ఎవరి పనుల్లో వారు బిజీగానే ఉన్నాము.

అన్నట్లు మా బాగోగులు చక్కగా కనుక్కుంటున్నారని, తరచుగా వచ్చి పోతున్నారని పేపర్‌లో చూసాము.

మీరు వస్తూనే ఉండి ఉంటారు... మా బిజీలో మేమే పట్టించుకోని ఉండము... ఈ మధ్యే రోడ్లన్నీ చాలా బాగా చేయించామని అంటున్నారు. పొరపాటున మా రోడ్డు మర్చిపోయినట్లున్నారు. పెద్దగా చెడిపోలేదు. రెండు కిలోమీటర్ల ప్రయాణానికి బండిమీద జస్ట్ ... ఓ పదిహేను నిమిషాలు మాత్రమే పడుతోంది. మరి ఆ మాత్రం జాగ్రత్తగా వెళ్ళక పోతే ఎలా? మొన్నీ మధ్యనే ఓ బామ్మగారు గుంటలో పడి కాలు విరగ గొట్టుకున్నారు. వాళ్ళ అబ్బాయికి జస్ట్ ఓ యాభైవేలు ఖర్చు అయింది. బామ్మగారు ఎంచక్కా వో మూడు నెలలు బెడ్ రెస్ట్ తీసుకున్నారు.

అయినా బామ్మగారికి... బయట పని ఏమిటి?... బి.పి. షుగర్లు పరీక్ష చేయించుకోవాలంటే ఆసుపత్రికి వెళ్ళాలా? మిషన్లు కొనుక్కోని ఇంటిలో చేసుకోవచ్చు కదా! అని జనం గుసగుస లాడుకుంటున్నారు.

మీరు కూడా మొదట ఉన్న కండువా గాక కండువా మార్చారని గుసగుస లాడుతున్నారు...

ఏం జనమో ఏంటో!?

ఈసారి మళ్ళీ మా ఓట్లు కొనడానికి వచ్చేటప్పుడు మీరు వాడే రుమాళ్ళు ఓ ఐదారు తెచ్చివ్వగలరు. గతసారి మీరు వచ్చినప్పుడు మా పక్కింటి పంకజం గారి మూడో అమ్మాయి చీమిడి ముక్కు మీ రుమాలుతో తుడిచి.. ఛీ! ఛూ!! అంటూ విచిత్రంగా ముద్దు చేసారు.

అప్పటి నుంచి దాని ముక్కు ఎప్పుడు తుడవాలని చూసినా ముఖం పక్కకి తిప్పేస్తూ చెయ్యి బయటికి చూపిస్తూ ఏదో చెప్పాలని చూస్తోంది. అష్ట కష్టాలు పడి దానిని డీ కోడ్ చేస్తే మీరు తుడిచిన రుమాలుతో తుడవమని అడుగుతున్నట్లు అనిపించింది. మీ రుమాలు నచ్చిందో, ఖరీదయిన సెంటువాసన నచ్చిందో తెలియట్లేదు.

అదే విధంగా కాస్త ఇస్త్రీ చేయడం, టీ, కాఫీ కలపడం కూడా నేర్చుకోగలరు. పోయిన సారి మీరు మా సుబ్బారావు ఇస్త్రీ షాపు దగ్గర కెళ్ళి పంచలచాపు ఇస్త్రీ చేసారు.

సుబ్బారావు ఉబ్బితబ్బిబు అయిపోయి... మీరు ఇస్త్రీ చేసిన పంచలచాపు అంటూ గొప్పగా విప్పి చూపబోతే లోపల కాలిన చిల్లులు! పైన బానేవుండి లోపల ఎలా కాలిందబ్బా?... అని అందరం జుట్టు పీక్కునా అర్థం కాలేదు!

దిగులు, ఆశ్చర్య ఆందోళనతో సుబ్బారావుకి పాపం బట్టతల అయిపోయింది.


పైకి నవ్వుతూ లోపల మండిపోయే మీ అందరికి సింబాలిక్ ఏమో అది.

మా సీతాపతి హోటల్‌లో కాఫీ కలిపి తాగమని ఇచ్చారు. తాగిన వాళ్ళు అర్ధరాత్రి నుండే బాత్‌రూమ్ దగ్గర మంచం వేసుకున్నారు.

మీరు కలిపి ఇచ్చిన ఆనందంతో ఎగిరి గంతేసిన సీతాపతి నడుము నెప్పి ఇంకా తగ్గలేదు. ఖర్చు బానే అయింది. చాలా రాయాలని ఉన్నా ప్రస్తుతానికి ముగిస్తున్నాము.

చెత్త బుట్టకు ఆహార మవుతుందని తెలిసినా ఏదో మా పిచ్చి కొద్ది రాశాము.

ఇక ఉంటాము. ఇట్లు
అమాయక జనం






**వెంకట శివ కుమార్ కాకు,**
**9160730005**

ప్రియమైన పావురాయికి,

నీ ప్రియమైన నేస్తం పోస్ట్ మ్యాన్, పువ్వుల మధ్య కూర్చొని రాస్తున్న నవ్వుల జాబు.

అసలు ఉత్తరం పేరు చెప్పగానే... ఉత్తరం నుంచి దక్షిణం దాకా... తూర్పు నుంచి పడమర దాకా... టక్కున గుర్తు వచ్చే పేరు పావురం. జాబు అనగానే జవాబు నీ పేరే కదా! నీ తర్వాత కాలంలో కాగితంపై రాసిన సందేశాలు ఎన్నో మేమే జాగ్రత్తగా చేరవేసే వాళ్ళం.

ఇన్లాండ్ లెటర్ రూపంలో ఇండియా మొత్తం తిరిగిన సందేశాలు...కార్డుపై సింపుల్గా పంపే సందేశం. కవర్లో దొబూచులాడిన ప్రేమ కబుర్లు... పర్సనల్ నుంచి ప్రొఫెషనల్ సందేశాలు ఎన్నో...

పుట్టుక గురించి కబుర్లు చెప్పినప్పుడు అవతలి వాళ్ళ ముఖంలో నవ్వులు. అదే జాబు చావు కబురు మోసినప్పుడు కన్నీళ్లతో తడిచిన మా జేబులో రుమాళ్ళు.

టెక్నాలజి పెరిగింది. మనిషిలో టెక్కు పెరిగింది. మా వాడకం తగ్గింది... జాబులో సందేశం చదివే భారం తగ్గించి, మనిషిని సోమరి చేసి మాట్లాడించే టెలిఫోన్ వచ్చింది. క్షణాల్లో మాటలు శ్రవణ రూపంలో రవాణా!

కొన్నాళ్ళకి ఇంటర్నెట్తో ఈ-మెయిల్ కూడా వచ్చింది. మిత్రమా! ఆ ఈ-మెయిల్కి నీ బొమ్మనే వాడుతున్నారు. నీ పర్మిషన్ ఏమైనా అడిగారా? పోనీలే నిన్ను గుర్తు పెట్టుకొని నీ బొమ్మైన వాడుతున్నారు. సంతోషమే! ఇప్పుడైతే క్షణాల్లో సందేశం అవతలకి చేరిపోతోంది. కానీ అప్పట్లో నువ్వు ఎన్ని తిప్పలు పడ్డావో కదా!

రాచ కార్యాలు ఎన్ని నిర్వర్తించావో?... రాజ రహస్యాలు ఎన్ని మోసావో?... నువ్వు మోసిన సందేశం వల్లే యుద్ధాలు జరిగి వుండొచ్చు! యుద్ధం జరగకుండా ఆగి కూడా వుండొచ్చు. ఏదైనా సందేశం పంపించాలి అంటే నువ్వు వుండాల్సిందే కదా!

అవునూ... మీకు శిక్షణ ఇచ్చేవాళ్ళా?... అసలు ఆ సందేశం సరిగ్గా వాళ్ళకే ఎలా చేర్చే దానివి? వందల మైళ్ళు ఎలా ఎగిరే దానివి? ఎండకి అలసట వచ్చేది కాదా? వాన వస్తే గొడుగు ఎలా? నీ కన్నా బలమైన గ్రద్ద దాడి చేస్తే ఎలా తప్పించుకొనే దానివి? నీ శిక్షణలో ఇవన్నీ వుండేవా? శత్రువు కాపు కాసి నిన్ను వధించి, నువ్వు మోసుకెళ్లే సందేశం చేరకుండా చేస్తే... మీ ప్రాణాలు చాలానే పోయి వుంటాయి కదా? సరే ఈ చావు కబుర్లు కాసేపు పక్కన పెట్టి కాస్త రొమాంటిక్ మాటలు చెప్పుకుందాం!



అందమైన రాకుమారులు / రాకుమారిలు నీ తలపై సుకుమారంగా తాకుతూ... తన ప్రియునికి/ ప్రియురాలికి ప్రేమ సందేశం నీ ద్వారానే కదా పంపించేది. ప్రేమ సందేశం మోసుకొచ్చిన నిన్ను రాకుమారుడు/రాకుమారి ముద్దాడి, తడిమి, నిమిరి ఆ ప్రేమ సందేశం చదివి మురిసిపోతుంటే... నువ్వు ఎంత పొంగి పోయేదానివో! వాళ్ళ సుకుమార చెయ్యి తగిలి నీకు గిలిగింతలు కలిగేవా? ఎందరో ప్రేమికుల్ని కలిపి వుంటావు కదా? అందుకే కదా నీ పేరు మీద ప్రేమ పావురాలు అనే సినిమా కూడా వుంది. శాంతికి చిహ్నంగా నిన్ను పోలుస్తారు. స్వేచ్ఛని చాటి చెప్పడానికి నిన్ను గాల్లో ఎగరేస్తారు.

ఈ టెక్నాలజి యుగంలో మళ్ళీ ప్రేమికులు నిన్ను వాడితే? నువ్వు ఎక్కడికైనా ఈజీగా ఎగర గలవు కదా? ఇప్పుడు లోకం చాలా మారిపోయింది... ఒకవేళ నువ్వు ప్రేమ సందేశం మోయాల్సి వస్తే ఒక్కడే 'నేను నిన్ను ప్రేమిస్తున్నా' అనే సందేశం ఇద్దరు ముగ్గురికి పంపిస్తాడు. ఇద్దరు ముగ్గురిని ప్రేమించిన వాడిది తప్పా? ఆ సందేశం మోసిన నీది తప్పా? నీ మెడకి కెమెరా పెట్టి, నిన్ను ఉపయోగించి... తన లవర్ వేరే వాళ్ళతో ఏమైనా తిరుగుతుందా? అని తెలుసుకొనే ప్రయత్నం చేస్తారు. ప్రేమికుల్ని కలపడం తర్వాత సంగతి, బ్రేకప్లు ఎక్కువ అవుతాయి ఏమో! పెళ్ళాలు మొగుళ్ల ఆఫీసు నుంచి తిన్నగా ఇంటికి వస్తున్నారో లేదో తెలుసుకొనే ప్రయత్నం. తాము ఆఫీసుకి వెళ్ళాక పెళ్ళాలు షాపింగ్ లు ఏమైనా చేస్తున్నారా... అనే తెలుసుకొనే ప్రయత్నం మొగుళ్ళు చేస్తారు ఏమో! జాబులు మోసే పావురాయి పాపపురాయి అవుతుందేమో!

ఈ కష్టాలు ముందే పసిగట్టినట్టున్నావు... జాబులు మోసే జాబ్ వదిలేసి అపార్ట్మెంట్ బిల్డింగ్ల మీద, రహదారుల్లో , పాత భవనాల్లో విలాస జీవితం గడిపేస్తున్నావు. నేనేమో ఇంకా బరువు లేని ఉత్తరాలు మోస్తూ వున్నాను. జాబు వచ్చింది అనే ఆతృత... ఒక్కడి ముఖంలో వుండడం లేదు. అప్పటికే ఈ-మెయిల్లో సందేశం చేరిపోయి వుంటుంది. ఇది కేవలం మరో ప్రత్యామ్నాయ సమాచారం... నువ్వు పదవీ విరమణ తీసుకొని ఆకాశంలో విహరిస్తున్నావు. మేము పదవీ విరమణ వచ్చే దాకా జాబులు జేబుల్లో మోస్తూ వున్నాం. ఇంటర్నెట్ లేని యుగంలో ప్రపంచాన్ని నీ రెక్కల సాయంతో ఒక్కటి చేసిన నీకు మరొక్కసారి కృతజ్ఞత చెప్పుకుంటూ...

మీ విధేయుడు
ఒక పోస్ట్ మ్యాన్




**బాలసుబ్రహ్మణ్యం మోదుగ,**
**9849674315**

ప్రియమయిన మామ గారికి...

మీ అల్లుడు సదానందం నమస్కరించి వ్రాయునది... నేను, మీ అమ్మాయి వసు క్షేమంగా చేరాము.

మీరు ఇచ్చిన ఆవకాయ జాడీలు కూడా భద్రంగా చేరాయి. కాకుంటే ఆవకాయలోని నూనెతో నా కొత్త బట్టలు తడిసి రంగు మారాయి. పాపం వసుకి తెలియదు కదా జాడీలు బట్టల మధ్యలో పెట్టకూడదని.

వసు మీ దగ్గర వున్నప్పుడు దూరదర్శన్‌లో ఏదో 'తీగపాకం' సీరియల్ చూసేదట. నాకున్న డిష్ కనక్షన్‌లో ఆ చానల్ ఎక్కడుందో ఇంకా వెదుకుతూనే వున్నాను.

రోజు ఆఫీసులో నాకు వచ్చే వందలో అరవై ఫోన్లు వసు నుంచే వస్తున్నాయి, ఆ సీరియల్ వచ్చే చానల్ త్వరగా కావాలని.

ఇంకో విషయం...మీ అమ్మాయి పేరు మీద మీరు రాసిచ్చిన రోడ్డు పక్క స్థలం చూడడానికి వెళ్ళాను. అది రోడ్డు పక్కనే వుంది కాని, దాని పక్కనే ఒక మురుగు కాలువ కూడా వుంది. ప్రస్తుతం ఆ స్థలంలో పందులు పడుకుంటు న్నాయి. నేను లెక్క పెట్టలేదు కాని... చాల ఉన్నాయి.

అసలు స్థలం అదేనా అని అనుమానం వచ్చి, మునిసిపల్ ఆఫీసులో సర్వే చేసి చెప్ప మని దరఖాస్తు ఇచ్చాను.

ఇవాళ వాళ్ళ దగ్గ ర్నుంచి ఉత్తరం వచ్చింది.

స్థలానికి పదేళ్ళ నుంచి పన్ను కట్టలేదు, తొంభైరెండు వేలు వెంటనే కట్టమన్నారు. లేకుంటే కోర్టులో కేసు పెడతామన్నారు.

ప్రస్తుతం నేను ఉండే అపార్ట్‌మెంటుకి లిఫ్ట్ లేదు.

మీరు వచ్చినప్పుడు మెట్లు ఎక్కలేరని, లిఫ్ట్ వున్న అపార్ట్‌మెంట్ కావాలని వసు అంటు న్నది.

నేను రోజూ సాయంత్రం రెండు గంటల పాటు దానికోసం తిరుగుతున్నాను.

ముత్తైదువులకు పెట్టమని అత్తగారు ఇచ్చిన జాకెట్ ముక్క, పసుపు కుంకుమ పొట్లాలు నా స్కూటర్లోనే వున్నాయి. తనకు ఎవరూ తెలియదని నన్నే ఇమ్మని వసు చెప్పింది.

నేను మా ఆఫీసులో సీనియర్లని అడిగి ఆ పని పూర్తి చేస్తాను.

కాళ్ళుకడుక్కోకుండా ఇంట్లోకి రానివ్వడం లేదు మీ అమ్మాయి.

అపార్ట్‌మెంట్ కారిడార్లో రోజూ నీళ్ళు పొయ్యడం వలన వాచ్‌మన్ నా వంక కోపంగా చూస్తున్నాడు. ఎదుటి పోర్షన్ వాళ్ళు నన్ను చూసి పలకరించే నవ్వులో ఏదో తేడా కనిపి స్తోంది.

ఇద్దరు ముగ్గురు చిన్న పిల్లలతో వసు స్నేహం చేసింది.

తనకు కాలక్షేపం అవుతుందికదా అను కున్నాను.

నిన్న క్రింది పోర్షన్ వాళ్ళు కంప్లైంట్ ఇచ్చారు.

అందరూ కలసి తొక్కుడు బిళ్ళ ఆడు తున్నా రట. ఆ శబ్దాలకి మంచం మీదున్న వాళ్ళ బామ్మ ఎగిరెగిరి పడుతున్నదట. ఈ ఆదివారం అపార్ట్‌మెంట్ కమిటీ మీటింగు వుంది. ఏమి చెప్పాలో నేనింకా ఆలోచించుకోలేదు.


మీరు పంపిన సారె సామానుతో మా రెండో బెడ్ రూం నిండి పోయింది. మీరు రావాలను కుంటే ముందే చెప్పండి. నేను ఆ రూములో కొంతయినా ఖాళీ వస్తుందేమో ప్రయత్నిస్తాను.

అత్తయ్య గారికి చెప్పండి, ఇక్కడ పప్పు రుబ్బడం పిండి దంచడం ఇంట్లో వీలుకాదు, రోకలి బండలు అటువంటివి తీసుకురాకండి.

ఇట్లు

మీ అల్లుడు సదానందం.






డాక్టర్ పార్థసారథి చిరువోలు,
99088 92065

'**అ**మ్మా! ఈ పదిరోజులుగా ఎంత నరక యాతన అనుభవించానో మాటల్లో చెప్పలేను. మనశ్శాంతి అంతా హరించుకుపోయింది. తెల్లవార్లూ కంటిమీద కునుకు ఉంటే ఒట్టు. ఒళ్లంతా హూనమైపోయేది. మా ఆయన, మగ మహారాజు, నా బాధ ఏ మాత్రం పట్టించుకునే వాడు కాదు. నా మీద సానుభూతి చూపించే వాడు కాదు కదా అదేమంత పెద్ద విషయం కానట్టు ప్రవర్తించేవాడు.

ఇంతకీ ఏమైందో నీకు అర్థం కాలేదు కదూ... వివరంగా చెబుతాను విను!


అపార్టుమెంటులో మూడో అంతస్థులో ఉన్న మా పోర్షన్‌లోకి ఓ మాయదారి ఎలుక ప్రవేశించింది. దర్జాగా మా రెండో బెడ్ రూంలో ఉన్న మంచం కింద తిష్టవేసింది. అసలు అది ఎప్పుడు వచ్చిందో కూడా మేం గమనించలేక పోయాం... చడీచప్పుడూ లేకుండా చేరి తన పని కానివ్వసాగింది. ఓ రోజున ఏదో అవసరం వచ్చి మంచం కింద సరుకులున్న అట్టపెట్టెను లాగాను... అంతే! నాకు పెద్దషాక్. అందులో ఉన్న మూడు ఆయిల్ ప్యాకెట్లు చిరిగిపోయి కనిపించాయి. అందులో ఉన్న నూనె అంతా కారిపోయి అట్టపెట్ట అంతా వ్యాపించటమే కాదు. అందులో నుంచి నేల మీదకు కారిపోయింది. సరకులన్నీ దెబ్బ తిన్నాయని ప్రత్యేకంగా చెప్పక్కరలేదనుకుంటా! ఎప్పటిలా కాకుండా ఈ నెలలో మా ఆయన ఎక్కువ సరుకులు తెచ్చి పడేశాడు.

అసలే ఓ వైపు జీఎస్టీ వల్ల ధరలు పెరిగితే, రష్యా యుద్ధం వల్ల ఇంకా పెరుగుతాయని ఎవరో ఆయనకు చెప్పారట. దీనితో ఇల్లంతా సరుకులతో నింపేశాడు. ఎలుక దెబ్బకు ఆ వస్తువులన్నీ సర్వనాశనం. మంచం లాగి కింద అంతా శుభ్రం చేసేసరికి నా తలప్రాణం తోక కొచ్చింది. ఏడుపొకటే తక్కువ. ఆ రోజు రాత్రి హాలులో దాని దర్శనమైంది. దుక్కలా ఉంది. ఇంట్లో ఉన్న ధాన్యం, పప్పులు, తినుబండారాలన్నీ బాగా మరిగినట్టుంది. ఓ కర్ర వెతికి పట్టుకుని దాన్ని తరమాలని ప్రయత్నించాను. ఆ గదిలో నుంచి ఈ గదిలోకి... అటూ ఇటూ పరుగులు తీసింది తప్ప దొరకలేదు. తెల్లవార్లూ లైట్లు వేసి ఉంచాను. అన్నీ తలుపులు తీసి పెట్టాను. ఎలాగైనా బయటకు పోతుంది అని ఆశించాను... మరుసటి రోజు అది కొన్ని జాకెట్లను నాశనం చేసింది. దాంతో పాటే కొన్ని విసర్జితాలు కూడా కనిపించాయి. అప్పటి నుంచి మూషికా సంహారం కోసం నా ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. అప్పటికప్పుడు షాప్ కు వెళ్లి ర్యాట్ మ్యాట్ తీసుకొచ్చి మంచం కింద పెట్టాను. మ్యాట్ పైన ఉన జిగురుకు తెల్లవారేటప్పటి కల్లా అది అతుక్కుంటుందని, ఆ తర్వాత దాన్ని తీసుకుపోయి అవతల పారేసి ఊపిరిపీల్చుకోవచ్చని అనుకున్నాను...

నా అంచనా తప్పింది. మరుసటి రోజు ఉదయం మంచం కింద మ్యాట్ నన్ను వెక్కిరిస్తూ కనిపించింది. ఓ పాత గుడ్డపై కారం చల్లి దానిని ఓ సంచిలో వేసి ఎలుక కన్నాల దగ్గర పెడితే మూషికాలు రావు, అని ఎవరో చెబితే ఆ ప్రయత్నం చేశాను. ఉల్లిపాయ, వెల్లుల్లి పాయ వాసన వాటికి పడదు. వాటిని చీల్చిపెట్టినా, బంగాళదుంపలను ముక్కలుగా చేసి ఎండ బెట్టి పొడిచేసి చల్లినా, మిరియాలు, లవంగాలు తీసుకుని పొడిచేసిన కన్నాల దగ్గర పెట్టినా ఎలుకల బెడదను వదిలించుకోవచ్చు అన్నారెవరో. పిప్పరమెంటు నూనెలో దూదిని ముంచి. ఆ దూదిని పడేసినా ఎలుకలు రావు. ఇలా ఎవరెవరు ఏది చెబితే అది చేశాను... పగలంతా ఇవన్నీ చేయటం, రాత్రి కాగానే లైట్లన్నీ వేసి కాపలా కాయటం... ఇలా సాగిపోయాయి పది రోజులు. ఎలుక అటు నుంచి ఇటు పరిగెడుతూ రోజూ ఏదో ఒక సమయంలో కనిపిస్తూ నన్ను కవ్వించేది. నేను దాని వెనుక పరుగులు తీసేదాన్ని పిచ్చిదాన్నిలా. కన్నుమూతపడేది కాదు. పొరపాటున కాస్త కునుకుపట్టినా అందులో ఒకటి కాదు, రెండు కాదు, వందలాది ఎలుకలు పరుగులు తీస్తూ కనిపించేవి. ఉలిక్కిపడి లేచేదాన్ని. నిజంగా ఉన్నది ఒక్కటే ఎలుక కదా, దానికి ఇంకొకటి తోడయి ఎలుకల సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతే అనే ఆలోచనను మనసును తొలిచేస్తూ భయపెట్టేది.

అదేం విచిత్రమో ఈ రోజు పొద్దున లేచి సామాన్లన్నీ చెక్ చేసుకున్నాను. వస్తువులన్నీ పెట్టినవి పెట్టినట్టే ఉన్నాయి. నిజంగా ఎలుక ఎలా వచ్చిందో, అలా వెళ్లి పోయిందా? నాకు ఈ రోజు నుంచి విశ్రాంతి దొరుకుతుందా?

ఏమో? ఆ విషయం ఆ భగవంతుడికే తెలియాలి.






ఆదోని బాషా,
9440239828

**కు**సుమ కోమల కమల నయన కుమారికి,

ఏభై ఏళ్ళ క్రితం నీతో కలసి చదువుకున్న ఓ అమాయక ప్రియుడు రాయు ప్రేమలేఖ! అప్పట్లో నీకు రాసిన తొలి ప్రేమలేఖలో కూడా నిన్ను ఇలాగే సంబోధించాను... గుర్తుందా?

చదువుకొనే రోజుల్లో తొలిచూపులోనే నిన్ను పిచ్చిగా ప్రేమించాను... కాలేజీలో నువ్వు ఎదురు పడగానే... నా గుండె వేగంగా కొట్టుకొనేది. నువ్వు నా వైపు చూడకుండా వెళ్ళిపోతే నా గుండె లబ్ డబ్ అని కొట్టుకొనే బదులు లబో దిబో మని కొట్టుకొనేది. నువ్వు నావైపు చూసినప్పుడు నా గుండె గల్లంతయిపోయేది. ఎంత వెతికినా దొరికేది కాదు. నువ్వు వెళ్ళిపోయాక అది నా దగ్గరికి తిరిగొచ్చేది. అలా నువ్వు కన్పించినంత సేపు నేను గుండె లేకుండానే జీవించేవాణ్ణి.

అప్పట్లో నీ అందం నన్ను పిచ్చివాణ్ణి చేసేది. చేపల్లాంటి నీ కళ్ళను చూసినప్పుడల్లా నాకు చేపల పులుసు తినాలనిపించేది... అయితే సంపెంగ పువ్వులాంటి నీ ముక్కు, దొండ పండు వంటి నీ అధరాలు నన్ను శాకాహారిగా మార్చేశాయి.

మొత్తానికి నీ ముఖంలాగే నీ మనసు కూడా అందంగా ఉంటుందనుకొని చాలా మంది నీ వెంటపడ్డారు. వారిలో అందరి కన్నా పిరికి వాడిలా కనిపించిన ఓ అమాయకుణ్ణి చూసి నువ్వు పెళ్ళి చేసుకున్నావ్. పెళ్ళయ్యాక వాడికి నీ నిజ స్వరూపం గురించి తెలిసింది.

నువ్వు అలనాటి సూర్యకాంతంకి కొంచెం తక్కువ, ఛాయాదేవికి కొంచెం ఎక్కువ గయ్యాళివని వాడికి అర్థమైంది. మీ అమ్మానాన్నలకు నువ్వు ఏకైక సంతానం కావటంతో వారు చిన్న పుట్టుంచి నిన్ను అతి గారాబంగా పెంచారు. నువ్వు ఆడుకోవటానికి రకరకాల బొమ్మల్ని కొనిచ్చారు. పెద్దయ్యాక ఆ ప్రాణం లేని బొమ్మలతో ఆడుకోవటానికి నువ్వు ఇష్టపడలేదు. దాంతో వారు ఓ ప్రాణమున్న బొమ్మను, అంటే భర్తను కొని నీకు కానుకగా ఇచ్చారు. ఆ అమాయక భర్తతో నువ్వు జీవితాంతం ఆడుకున్నావ్.

రోజూ తెల్లవారగానే వాణ్ణి పిడి గుద్దు గుద్ది నిద్రలేపేదానివి. పని మనిషిని మాన్పించి భర్తతోనే మొత్తం ఇంటి పని, వంట పని చేయించేదానివి. ఇంట్లో వాషింగ్ మెషీన్ వున్నా దాన్ని మూలన పడేసి నీ భర్తనే వాషింగ్ మనిషిగా మార్చేశావ్. వాడు ఎప్పుడైనా బట్టలు ఉతక్కపోతే నువ్వు వాణ్ణే ఉతికి ఆరేసేదానివి. పాపం, ఆ అభాగ్యుడు నిన్ను కట్టుకున్న పాపానికి దేవదాసులా మారి 'బాధే సౌఖ్యమని' పాడు కుంటూ ఇన్నాళ్ళు నిన్ను భరించాడు.

కాని కాలం అన్నిటినీ మార్చేస్తుంది.


వయసు మీద బడ్డాక నీ అందంతో పాటు నీ ఆరోగ్యం కూడా క్షీణించింది... అప్పట్లో చేపల్లా ఉన్న నీ కళ్ళు ఇప్పుడు చాపల్లా మారిపోయాయి. సంపెంగ పువ్వు లాంటి ముక్కు గోబీపువ్వులా... దొండపండు వంటి పెదవులు బొప్పాయి పండ్ల మాదిరి ఉబ్బిపోయి భయపెడుతున్నాయి... ఒకప్పుడు పాపలా ఉన్న నువ్వు ఇప్పుడు పీపాలా మారిపోయావ్!... మంచంపై నుంచి లేవటానికి ఆపసోపాలు పడుతున్నావ్.

ఇప్పుడు నువ్వు అప్పడాల కర్రతో అతన్ని కొట్టాలన్నా వంటింట్లోకి వెళ్ళి ఆ కర్ర తీసుకొచ్చే ఓపిక నీకు లేదు. దాన్ని కూడా నీ మొగుడే తెచ్చివ్వాలి. ఒకవేళ అలా తీసుకొచ్చినా ఆ అప్పడాల కర్రను నీ చేతికివ్వకుండా దాన్ని నీ మీదే ప్రయోగిస్తే నువ్వేం చెయ్యగలవ్?... మంచం మీంచి లేవలేని నువ్వు... అతని వెంట్రుక కూడా పీకలేవు.

అందువల్ల నీ భర్తను సాధించటం ఇక మానుకో.

ఈ ఉత్తరం రాస్తున్నది ఎవరో ఈపాటికి నీకు అర్థమయ్యే ఉంటుంది. కాలేజీ రోజుల్లో నిన్ను పిచ్చిగా ప్రేమించి, పిచ్చి ముదిరి నిన్ను పెళ్ళి చేసుకున్న నీ అమాయక భర్తని నేనే! నీతో నేరుగా చెప్పే ధైర్యం లేక ఈ ఉత్తరం రాస్తున్నాను. ఉత్తరం చదివాక కోపంతో నాపై చెయ్యి చేసుకోవాలని ప్రయత్నించకు. మంచం మీంచి లేచే ప్రయత్నంలో ఏ కాలో, చెయ్యో బెణికితే అప్పుడు నీకు సేవ చేయాల్సింది నేనే కదా! జీవితాంతం నీ చేతి దెబ్బలు తిని రాటుదేలిన నన్ను ఇప్పుడు నువ్వు కొట్టినా దెబ్బ తగలదు... కాని నేను తిరుగుబాటు చేస్తే మాత్రం నువ్వు ఇబ్బంది పడతావ్. కాబట్టి వాస్తవం గ్రహించి ఇప్పటికైనా పతియే ప్రత్యక్ష దెయ్యం.. ఐ మీన్.. ప్రత్యక్ష దైవం అనుకొని అతన్ని పూజించటం నేర్చుకో. ఉంటాను!

ఇట్లు,
నీ అమాయక భర్త అప్పారావు






**ఆచంట సుధాకర్,**
**94904 76993**

ప్రియమైన మిత్రుడు గోపాల్‌కి,
సుధాకర్ శుభాకాంక్షలతో వ్రాయునది.

ఎన్నో ఏళ్ళకి అనుకోకుండా మొన్న మీ ఊరుకి వచ్చి స్వచ్ఛమైన ఆ పల్లెటూరి వాతావరణంలో నిన్ను చూసిన తర్వాత గొప్పలు పోయే మా 'సిటీ' జీవితం గూర్చి ముఖ్యంగా కరోనా కాలం నాటి పరిస్థితులను నీతో చెప్పాలని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

అంతా 'లాక్‌డౌన్' అని ప్రకటించిన వెంటనే మా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు 'వర్క్ ఫ్రం హోమ్' చేయమన్నారని నా శ్రీమతికి చెప్పగానే ఆమె ఎంతో హ్యాపీగా సగం ఇంటిపని నాకు పురమాయించింది 'వర్క్ ఎట్ హోమ్' అనుకుని.

ఇంటిపని చేయడం కాదే, ఇంటి నుండి పనిచేయడం అని ఆమెకు నచ్చచెప్పేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. దాంతో తట్టుకోలేని ఆమె 'కూర్చుని తినడం కాదు... టిఫినైనా చేయండి అప్పుడప్పుడు' అని హుకుం జారీ చేసింది. దాందేముంది యూట్యూబ్‌లో తెలియని విషయమంటూ ఏం లేదని ధైర్యంగా సులభమైన ఉప్మా చేయడానికి సిద్ధపడి ఓ అరగంటకి తెల్లగా వున్న పలుకుపలుకుగా, ముద్దముద్దలుగా, ఓ పదార్థం చేసి ప్లేటులో పెట్టా. ఆ పదార్థానికి ఉప్మారవ్వ బదులు, ఇడ్లీ రవ్వ వేసానని అర్థం అయ్యింది.

ఇంట్లోనే కదాఅని లాప్‌టాప్ మంచం మీద పెట్టుకుని ఒంటిమీద బనీనైనా వేసుకోకుండా పని చేస్తుంటే బాస్ వీడియోకాల్ చేసాడు.

ఎంత ఇంట్లోంచి పనిచేస్తున్నా మరీ షర్ట్ కూడా వేసుకోకుండా పనిచేయడం క్రమశిక్షణా రాహిత్యమని చివాట్లు వేసాడు.

ఓరోజు వీడియోకాల్‌లో బాస్‌తో మాట్లాడుతుంటే మా ఆవిడ పెరట్లోంచి ఇంట్లోకి వస్తూ, "కుక్కర్ ఎన్ని విజిల్స్ వచ్చింద"ని నన్ను నిలదీసింది. అది గమనించని నేను ఆ.... అదీ... రెండు విజిల్స్ అనుకుంటా" అంటూండగా మా బాస్ 'మూడు విజిల్స్ వచ్చాయి నేను విన్నాను' అని గట్టిగా అరిచాడు.

ఆమె నన్ను చూసి విసుక్కుంటూ లోపలికి పోయింది. కిరాణా దుకాణాలన్నీ మూత పడదంతో అన్నీ ఆన్‌లైన్‌లో తెప్పించడం, ఇంటి బయటనే వాటికి శానిటైజర్‌తో స్నానం చేయించి లోపలికి తెచ్చుకోవడం నిత్యకృత్యమైపోయింది. ప్రక్కింటావిడ గోడ ప్రక్కనుంచి "పిన్నిగారూ!" కొంచెం శానిటైజర్, కాస్త హాండ్ వాష్ ఇస్తారా? మావారు బయటికెళ్లాలి. బజార్లో స్టాక్ అయిపోయిందట. రాగానే ఇచ్చేస్తాను" అని తరచూ తీసుకెళ్ళేది.

లాక్‌డౌన్ పేరు చెప్పి ఆడవాళ్ళ పనులెన్నో అలవాటయ్యాయి.



ఇంట్లో భాగోతం ఇలా వుంటే ఇక ఏదైనా మెడిసిన్ అర్జెంటుగా కావాలని బయటికి వెళ్ళాల్సివస్తే ఓ జేబులో పావులీటర్ శానిటైజర్, మరో జేబులో ఓ సీసా హ్యాండ్‌వాష్ పెట్టుకుని ముఖమంతా కప్పేసే మాస్క్‌తో వెళుతుంటే పొరబాటున తుమ్మొస్తే ప్రక్కనున్న పెద్దవాళ్ళు "చిరంజీవ-చిరంజీవ" అనే బదులు 'ఛీ వెధవ – ఛీ వెధవ' అంటున్నారు.

వాడెవడో దూరంగా దగ్గితే 'దరిద్రుడు, దరిద్రుడు' అని తిట్టి పోస్తున్నారు. ఊపిరాడక ఓరోజు రోడ్ పక్కకి వెళ్లి మాస్క్ తీసేనో లేదో వెనకనుండి ఓ పోలీస్ వచ్చి వెయ్యిరూపాయలు ఫైన్ వేసాడు. ఓరోజు ఉదయమే కెవ్వుమని పసివాడి కేకలు విని వీధిలోకి పరుగెత్తి చూడగా ఎదురింట్లో నుండి ఓ వ్యక్తి అంతరిక్ష యాత్రికుడిలా తల నుండి పాదం వరకూ కప్పేసుకున్న ప్లాస్టిక్ డ్రస్‌లో ఉన్న అతన్ని చూసి ఆ పసివాడు 'దెయ్యం, దెయ్యం' అని అరిచాడు.

అతను గవర్నమెంట్ హాస్పిటల్‌లో పని చేస్తున్న మేల్‌నర్స్.

ఇంక అదే సమయంలో వచ్చిన బోనాల పండుగలో ఆడవాళ్ళు ఒకరికొకరు "ఇచ్చినమ్మ శానిటైజర్, పుచ్చికొంటినమ్మ మాస్క్" అంటూ వాయనాలు తీసుకున్నారు.

ఓరోజు రాత్రి కరెంటు పోయింది. తిరిగి కరెంట్ రాగానే పక్కింట్లోనుండి పెద్ద పెద్ద కేకలు.

"అయిపోయింది... అంతా అయిపోయిందండీ. మూడుసార్లు గట్టిగా ఊదినా ఈ కొవ్వొత్తి ఆరలేదు. అంటే నా ఆక్సిజన్ లెవెల్స్ పడిపోయాయి." అంటూ ఆ ఇంటాయన అరవసాగాడు. వెంటనే అక్కడికి వెళ్లిన నేను–

"సార్! ముందు మీ మొహానికున్న మాస్క్ తీసి ఊదండి. మీకేం కాలేదు!" అని ఊరడించాల్సి వచ్చింది. ఒత్తిళ్ళు అలా చిత్తు చేసేవి. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ సిటీ జీవితంలో అడుగడుగునా వ్యధలు, ఒత్తిళ్ళే కానీ సుఖశాంతుల్లేవు.


రోజూ చల్లని స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ, పచ్చని పొలాల ప్రక్కన చెట్ల మధ్యలో ఇంట్లోంచి సూర్యోదయ, సూర్యాస్తమయాలను వీక్షిస్తూ, రకరకాల పక్షుల కిలకిలారావాలు తప్ప శబ్దకాల్యుం లేని ప్రశాంత ఆరోగ్య వాతావరణంలో నీ చదువుని ఆధునిక వ్యవసాయంలో ఉపయోగిస్తూ నీవే ఎంతో గొప్పగా జీవిస్తున్నావని ఆశిస్తూ...


ప్రేమతో మిత్రుడు
ఆచంట సుధాకర్


# కొత్త సంవత్సరంలో సంక్రాంతి సరదాలు


Happy New Year


naarisetty.. Sviramana (ARUN)






# ఎవరికి తెలుసు?

(కామెడీ స్కిట్)

మేడా మస్తాన్ రెడ్డి
9441344365

**వేదిక–కాంతారావు క్లినిక్,**

**సమయం– ఉదయం 10 గంటలు**

డాక్టర్ : (కాంపౌండర్‌తో) ఇదిగో అప్పారావు. క్లినిక్ తెరిచి గంట దాటింది. అయినా ఒక్క రోగి కూడా రాలేదు. ఎందుకంటావ్?

కాంపౌండర్ : ఎందుకొస్తారు సార్? రారు!

డాక్టర్ : త్రేతాయుగం నాటి రామరాజ్యం వచ్చిందా ఏం?

కాంపౌండర్ : సోషల్ మీడియా వచ్చింది సార్!

డాక్టర్ : వస్తే?...

కాంపౌండర్ : ప్రతి మనిషి చేతిలోకి స్మార్ట్ ఫోన్ వచ్చింది కదా సార్.

డాక్టర్ : వస్తే?

కాంపౌండర్ : ఆ ఫోన్ ద్వారా వాట్సప్ వైద్యం, యూ ట్యూబ్ ట్రీట్ మెంట్ అంటూ, ఫేస్‌బుక్ సలహాలు తీసుకుంటూ సొంతంగా జబ్బుల్ని ఎవరికి వారే నయం చేసుకుంటున్నారు సార్.

డాక్టర్ : ఏడ్చినట్టుంది. సరే! బయట ఏదో చప్పుడవుతుంది. ఎవరో పేషెంట్ వచ్చినట్టున్నారు చూడు.

(అప్పారావు గది బయట వచ్చి చూస్తాడు. మధ్యవయస్సున్న దంపతులు అక్కడ నిలబడి ఉంటారు.)

కాంపౌండర్ : రండి. రండి! మీలో ఎవరు పేషెంటు? భర్తా? భార్యా? లేక భార్యాభర్తలిద్దరూనా?


భార్య : నాకేం మాయరోగం లేదు. ఈయనకే కడుపునొప్పి. దాంతో పొద్దుట్నుంచీ పక్క మీద దొర్లుతూనే ఉన్నాడు.

కాంపౌండర్ : (భార్యతో) అయితే మీరు ఇక్కడే ఉండండి. (భర్తతో) మీరు లోపలికి రండి.

డాక్టర్ గదిలో...

డాక్టర్ : మీ పేరేమిటి?

భర్త : బంగారయ్యండీ.



డాక్టర్ : వయస్సెంతా?
భర్త : యాభైయండీ.
డాక్టర్ : ఏమిటి సమస్య?
భర్త : కడుపునొప్పి డాక్టర్.
(డాక్టర్ థర్మామీటర్ చేతిలోనికి తీసుకుని) ఊ... నోరు తెరవండి.
భర్త : కడుపునొప్పి అని క్లియర్‌గా చెబుతుంటే దాన్ని నోట్లో పెడతానంటారేమిటండీ?
డాక్టర్ : ఒంట్లో ఎక్కడ నొప్పి ఉన్నా దీన్ని నోట్లోనే పెడతారు. ముందు తెరవండి నోరు.
(థర్మామీటరును నోటిలో పెట్టి బయటకు తీసి స్టెత్‌తో కడుపు మీద తట్టి) పొట్ట యారాడ కొండంత గట్టిగా ఉంది. అజీర్ణం చేసినట్టుంది. కొన్నాళ్ళు వేడినీళ్ళు తాగాలి.
భర్త : (గర్వంగా) తాగుతూనే ఉన్నానండి. అంతేకాదండీ. టాయిలెట్‌కు కూడా వేణ్ణీళ్ళే వాడతానండి.
డాక్టర్ : (ఆశ్చర్యంగా) అవునా! సరే! రోజూ ఏం తింటుంటారేమిటి?
భర్త : మా ఆవిడ ఏది పెడితే అది తింటుంటానండీ.
డాక్టర్ : మీ ఆవిడ ఏం పెడుతుంటుందేమిటి?
భర్త : ఏది వండితే అది పెడుతుందండీ.
డాక్టర్ : మీ ఆవిడ ఏం వండుతుంటుందేమిటి?
భర్త : ఇంట్లో ఏం ఉంటే అదే వండుతుందండీ.
డాక్టర్ : (విసుగ్గా) ఇంట్లో ఏమేమి ఉంటాయండి?
భర్త : నేను ఏమి తెస్తే అవే ఉంటాయి కదండి.
డాక్టర్ : మీరు ఏమి తెస్తారండీ?
భర్త : మా ఆవిడ ఏమి తెమ్మంటే అవే తెస్తానండీ.
డాక్టర్ : ఆవిడ ఏమి తెమ్మంటుంది?
భర్త : ఆమెకు ఇష్టమైనవే తెమ్మంటుంది.
డాక్టర్ : (తల పట్టుకుని) ఆమెకు ఇష్టమైనవి ఏవండీ?
భర్త : ఏమో! నాకేం తెలుసు. మా ఆవిడనే అడగండి... బయట ఉంది.
డాక్టర్ : (బిగ్గరగా) అప్పారావు, ఆవిడని పిలువు.
(ఆ కాంపౌండర్ ఆవిడను తీసుకుని వస్తాడు)
భర్త : పేరేమిటమ్మా?
భార్య : ఆయన చెప్పలేదా?
డాక్టర్ : ఆయన పేరు ఆయన చెప్పారు. మీ పేరు చెప్పండి.
భార్య : తాయారమ్మ.
డాక్టర్ : మీ వారికి రోజూ ఏం పెడుతుంటారు?
భార్య : ఏది వండితే అదే పెడుతుంటానండి.
డాక్టర్ : అదే... అదే... ఏం వండుతారని అడుగుతున్నాను?
భార్య : ఆయన ఏది తెచ్చి పడేస్తే అదే వండుతానండీ.
డాక్టర్ : ఆయన ఏది తెచ్చి పడేస్తారమ్మా?
భార్య : నేను ఏది తెమ్మని చెబితే అదే ఆయన తెస్తారండి.
డాక్టర్ : మీరు ఏది తెమ్మని చెబుతారు?
భార్య : ఆయనకు ఏది ఇష్టమో అదే చెబుతానండీ.
(డాక్టర్ కళ్ళజోడు తీసి టేబుల్ మీద పెట్టి)
డాక్టర్ : ఆయనకు ఏది ఇష్టమమ్మా?
భార్య : ఎదురుగా ఉన్నారు కదా! ఆ విషయం ఆయన్నే అడగండి. అన్నీ నన్నే అడుగుతారేం?
(డాక్టర్ స్పృహ తప్పి టేబుల్ మీదకు ఒరిగిపోతాడు)
భార్య : (భర్తతో) మూర్ఛరోగం ఉన్న డాక్టర్ వద్దకు వచ్చి తప్పు చేసాం. పదండి. మరో డాక్టర్ దగ్గరకు వెళ్దాం.
(ఇద్దరూ వెళ్లిపోతారు. కాంపౌండర్ గ్లాస్‌తో నీళ్ళు తెచ్చి డాక్టర్ మొహం మీద చిలకరిస్తాడు)
డాక్టర్ : (కళ్ళు తెరిచి చూసి భార్యాభర్తలు వెళ్ళిపోయారని నిర్ధారించుకుని నీరసమైన గొంతుతో) అవును అప్పారావ్... రోజూ నువ్వేం తింటుంటావయ్యా?
కాంపౌండర్ : మా ఆవిడ ఏది పెడితే అదే తింటుంటానండీ.
డాక్టర్ : (కోపంగా) మీ ఆవిడ ఏం పెడుతుంటుందయ్యా?
కాంపౌండర్ : ఆవిడ ఏది వండితే అదే పెడుతుంటుంది సార్! (డాక్టర్ మళ్ళీ స్పృహ కోల్పోతాడు)


GIET UNIVERSITY
GUNUPUR
nirf 2022
Established by Govt. of Odisha Act 23 of 2018. Approved by UGC, AICTE & AIU, New Delhi www.giet.edu
Our Placement is equivalent to the best universities of India. But fees continue to be affordable as usual.



of Excellence in higher Technical & Professional education
90+ % Placement Every Year
CAMPUS PLACEMENT DURING 2022 IS 96%
with highest package of 26 lakhs per annum. For details visit www.giet.edu/placements
164 RECRUITERS | 54 CMM-5 COMPANIES | 1035 JOB OFFERS | 26 LAKHS P.A. HIGHEST PACKAGE
PROGRAMMES OFFERED FOR ADMISSIONS
B.TECH: COMPUTER SCIENCE & ENGINEERING (AI & ML, Data Sc., IOT, Cyber Security & Block Chain Management), Agricultural Engineering, Civil Engineering, Biotechnology Engg., Chemical Engineering, Mechanical Engineering, Electrical Engineering, Electronics & Comm. Engg., Electrical & Electn. Engg.
M.TECH: Machine Design, Chemical, Heat Power & Thermal, ECE, Power Electronics, CSE, Structural Engg., Biotechnology, Construction Tech. & Mgmt., Manufacturing Tech.
M.Sc.: Agriculture, Phy., Chem., Mathematics, Life Sc., Biotech
MA : English, Education, Social Work, Economics
B.Sc. (Ag.) | B.Sc. Nursing | BBA | MBA | BCA | MCA | Ph.D IN ALL SUBJECTS
@gietuniversitygunupur 8118053001-009 deanadmission@giet.edu





# పుట్టిన్రోజు స్పెషల్
## ఎడిటర్ ఫన్ ప్రశ్నలకు-
## బర్త్‌డే బాయ్ సుదర్శనమ్
## పంచ్ సమాధానాలు

*Cartoons: Sangram*

✦ ముందుగా మీకు పుట్టిన్రోజు శుభాకాంక్షలు! ఈ పుట్టిన్రోజుకి మీరు కొత్త నిర్ణయాలు ఏం తీసుకుంటున్నారు?

**కిందటి పుట్టిన్రోజుకి తీసుకున్న నిర్ణయాలు ఈ పుట్టిన్రోజుకి అమలు చేయాలని!... ప్రతి పుట్టిన్రోజుకి ఇలా కొత్తగా నిర్ణయం తీసుకొంటుంటాను!**



✦ మంచి హ్యూమరిస్ట్ కావాలంటే ?



**ముందు... మంచి హ్యూమనిస్ట్ కావాలి!**

✦ విజయానికి గెలుపుకి తేడా?

**విజయంలో మన 'వర్త్' ఉంటుంది... గెలుపులో మరొకడి 'ఓటమి' ఉంటుంది!**



✦ నిజమైన క్యారెక్టర్/వ్యక్తిత్వం అంటే...?

**ఎవరూ చూడరనుకున్నపుడు చే(చూ)సేది(?)! ఎవరూ వినరనుకున్నపుడు మాట్లాడేది(?)!**





✦ విట్టులాంటి హాస్యానికి, వెగటులాంటి పరిహాసాలకి తేడా ఎలా తెలుస్తుందంటారు?

**'దేంతో' నవ్వుతారనేదాన్నిబట్టి...! అదే...నోటితోనా, నొసటితోనా?!**

✦ పండగలు, పబ్బాలు అంటారు కదా? పబ్బం అంటే ఏమిటి?

**పండగ... జరుపుకునేది! పబ్బం... గడుపుకునేది!!**







✦ కొందరు అదేంటో... ఖాళీ దొరికితే నవ్వుకుందాం అనుకుంటారట!?

**కారు ఆగిపోతే 'ఫ్యూయల్' పోయించుకుందాం అనుకునే రకాలు... వాళ్ళ జోలికెళ్ళకండి!**

✦ మీకు మంచి మిత్రులెవరైనా ఉన్నారా?
**ఎందుకు లేరు?... అప్పిచ్చి మర్చి'పోయి'నోళ్ళు బోలెడుమంది ఉన్నారు.**




✦ సినిమాలు 'తీసే' వ్యాపారం చేస్తే బెటరా?... 'కొనే' వ్యాపారం చేస్తే బెటరా?
**ఏదైనా 'తెలిసి' చేస్తే బెటర్... 'వ్యాపారం'!**




✦ ఆడవాళ్ళకు సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువా? తక్కువా?
**ఇద్దరుంటే సెన్సాఫ్ 'హేమర్'(మనకి)... ముగ్గురుంటే సెన్సాఫ్ 'రూమర్'(వాళ్ళకి) ఎక్కువ... అని మీలాంటి వాళ్ళు చెప్పారు.**







✦ తాపత్రయం అంతా జానెడు పొట్ట కోసమేనా?
**గుప్పెడు గుండె కోసం కూడా!**






✦ ఆడది/ భార్య మిస్టరీ... మరి మగాడు/భర్త?
**హిస్టరీ!... గతం తప్ప భవిష్యత్ లేనివాడు!!**



✦ ఒక స్త్రీకి ఇంకో స్త్రీయే శత్రువా?
**ఏమో... వాళ్ళిద్దరూ నాకెప్పుడూ చెప్పలేదు!**

✦ మిమ్మల్నే ఓ ప్రశ్న అడగమంటే ఏం అడుగుతారు?
**కుశల ప్రశ్న!**





✦ సంక్రాంతి కోడి పందాలకు వెళుతున్నారా?
**వెళ్ళటం లేదు!... పోలీసులు కత్తి కడతారేమోనని!!**



హాస్యానందం సౌజన్యంతో
**శ్రీవూటుకూరి సుబ్బారావుగారి స్మారకంగా**
**రామ్‌కుమార్స్ డయాబెటిస్ అకాడమీ& డాక్టర్స్ స్మైల్‌క్లబ్ వారు నిర్వహించిన**

# చక్కెర 'కేళి'

## ఎస్.ఎమ్.ఎస్ పోటీల ఫలితాలు

**అందరికీ నమస్కారం.**

ఈ ఎస్.ఎమ్.ఎస్ పోటీలో పాల్గొన్న అందరికీ అభినందనలు.

చిన్న చిన్న మాటల ద్వారా మనం ఇచ్చే మెసేజ్‌లు ఆలోచింప జేస్తుందనే నమ్మకంతో ఈ యేడాది ఈ ఎస్.ఎమ్.ఎస్ పోటీలు నిర్వహించాము. డయాబెటిస్ మీద అవగాహన వచ్చి అందరూ ఆరోగ్య వంతంగా మనుగడ సాగించాలనే మా సంకల్పానికి మీ చేయూత మాకెంతో ఉత్సాహాన్నిచ్చింది. రానున్న కాలంలో మరిన్ని వినూత్న పోటీలలో అందరూ పాల్గొని డయాబెటిస్ అవేర్‌నెస్‌కి కృషి చేయాలని కోరుతూ...

**–డాక్టర్ రామకుమార్, డాక్టర్ కమల,**
**డాక్టర్స్ స్మైల్ క్లబ్ & మెంబర్స్, గుంటూరు**

ఉంటే వైద్యుని పర్యవేక్షణ
జీవన శైలిలో క్రమశిక్షణ
సాధ్యమే చక్కెర వ్యాధి సంపూర్ణ నియంత్రణ!

**– డా.డి.వి.జి.శంకర రావు**,94408 36931

విరుచుకు పడక ముందే...
మధుమేహాన్ని అదుపులో పెట్టండి!
నడకే మీ ఆయుధంగా తరిమి తరిమి కొట్టండి!!

**– డా.రావెళ్ల, 9949330596.**

'సంతోషం' సగంకాదు, పూర్తి బలం. 'మనసులోని విచారం' చక్కెర వ్యాధికి మూలం. బలమైన తిండి తినండి. తిన్నది అరిగే వరకు శ్రమ చెయ్యండి. వైద్యుడిచ్చిన మందులు క్రమం తప్పకుండా వాడండి. నవ్వుతూ తుళ్ళుతూ జీవించండి... ఎదుటి వారికే కాదు, మీక్కూడా తెలియదు మధుమేహం ఉన్న సంగతి.

**– బాలసుబ్రహ్మణ్యం మోదుగ, 9849674315**

తీపి జబ్బున్న మిత్రులకు ఒక విన్నపం
ప్రాణం మీద తీపి ఉంటే నోరు తీపి చేసుకోకండి.
అప్పుడు మీ శత్రువు పై మీకు జయం
ఆపై జీవితం అంతా ఆనందమయం!

**–డాక్టర్ ఎమ్ సుగుణ రావు, 9704677930**

మధుమేహం నాకు తెచ్చిన తంట,
నన్ను తీపికి దూరం చేసెనంట,
ఇక నీ మాటలే తియ్యనంట,
మళ్ళీ నోరు తీపి చేసుకోవడం దేనికంట!

**–చందన కాశీపురం,9030171446**

ఈ లోకంలో అందరికీ అన్నీ దొరకవు. ఆకాశం దొరికిన వారికి భూమి దొరకదు. భూమి దొరికితే ఆకాశం దొరకదు' అన్నాడో కవి. ఆరు రుచుల్లో ఒకటి కోల్పోవటం లోటు కాదు. తేనెలా తియ్యగా వుండే తెలుగులో మాట్లాడి ఆ లోటును తీర్చుకో మిత్రమా!

**–డి. ఎం. బాషా,9440239828**

చక్కెరవ్యాధి అంటే భయాన్ని 'వదిలిపెట్టు'
వ్యాయామంతో చేయి 'కనికట్టు'
మితాహారంతో దాన్ని 'అదిమిపట్టు'
హాస్యానందంతో జతకట్టి దాన్ని'తరిమికొట్టు'

**–శింగరాజు శ్రీనివాసరావు, ఒంగోలు**

అనవసరమైన ఆలోచనలు వదిలేద్దాం,
అవసరమైనంతే తిందాం,
కాళ్ళకు పని ఎక్కువ చెప్పేద్దాం,
చక్కెర వ్యాధిని తగ్గించేద్దాం.

**–రవి శంబంగి, 96633 95653**

బైట ఫుడ్డు వద్దురా...
ఇంటి వంట ముద్దురా...
వ్యాయామం చెయ్యరా...
చక్కెరవ్యాధి రానే రాదురా!
**-ఎన్. సునీల్ బాబు, 9705901461**

ప్రతిరోజూ నడక,
ప్రశాంతంగా పడక...
పీచుపదార్థాల ఆహారం వీడక...
యోగాతో సుగర్ మునక.
**-కుప్పిలి వెంకటరాజారావు, 9908371688**

చక్రకేళీ ఒంటిచేత్తో
ఒలుచుకుతింటే
చక్కెరవ్యాధి ఆమడదూరం
నిజ్జంగా నిజ్జం...ప్రయత్నిస్తే పోలా!
**-గొర్తివాణిశ్రీనివాస్,9441345651.**

తిండి తగ్గించాలి- వ్యాయామం పెంచాలి...
షుగర్ వ్యాధి రాదు-వచ్చినా పెరగదు....
పిండిపదార్థాలు వద్దు-ఆకుకూరలే ముద్దు...
బలమైన ఆహారం తినాలి-బద్ధకం వదలాలి!
**-యలమర్తి చంద్రకళా, 8008915928**

షుగరు వస్తుందేమో అని అనుమానమా?
కార్బోహైడ్రేట్లు ఉండే పదార్థాలు పక్కన పెట్టు...
శరీరానికి పని కలిపించి నడకను పెంచు...
నిత్యం 'నడక'లేనివాడికి ఇక పడకే!
**-జీడిగుంట నరసింహమూర్తి, 9866187886**

బరువు తగ్గి జయించు అనారోగ్యాన్ని... సుగర్‌పై నెగ్గి పొందు ఆరోగ్యాన్ని.... తగ్గించు తిండి....
వదిలేయ్ బండి... పాదాలకు పనిచేస్తే నండి... సుగర్ జబ్బు ఖతమండి!
**-మన్నవ సాయి రామ భార్గవి ప్రియ, ఫోన్:: 8500482586**

ఒంట్లో చక్కెరకు ముందే
వేస్తే కళ్లెం...
జీవితం అవుతుంది....
ఆరోగ్యపు మిఠాయి పళ్లెం!
**-సూర్యచంద్రరావు, 9959365373**

సుగర్ కానే కాదు జబ్బు...
అది వంటికి పట్టిన గబ్బు...
దానికి వాడు వ్యాయామం అనే సబ్బు...
అవుతుంది నీ శరీరం తబ్బిబ్బు!!
**-మన్నవ సాయిరామ గౌతమి షణ్ముఖ ప్రియ, 8500482586**

షుగర్ భయం జనంలో
ఎంతగా పెరిగింది అంటే...
తీపి తినడమే కాదు... తియ్యగా
మాట్లాడడం కూడా మానేశారు!
**-అజ్ఞాతవ్యక్తి**

నీ జీవన విధానాలు గజిబిజిగా ఉంటే...
నీ ఆహారపుటలవాట్లు అస్తవ్యస్తమైతే...
జంక్ ఫుడ్స్, సిగరెట్స్ లాగిస్తూ ఉంటే ...
నిన్ను చక్కెర వ్యాధి కాక... చక్కని ఆరోగ్యం వరిస్తుందా?
**-కోరుకొండ వెంకటేశ్వరరావు, 9505747932**

మీ మనసు తీపి... మీ మమత తీపి...
మీ పలుకు తీపి... మీ నడత తీపి...
మొత్తంగా మీకు మీరు తీయని తీపి...
మరింకెందుకు వదిలేద్దురూ తీపి పైన ప్రీతి!
**-నందిరాజు పద్మలత జయరామ్,949292138**

సుగరంటే... ఎందుకంత షివరు?... "తన్ తన్ మే సుగర్... ఘర్ ఘర్ మే సుగర్... మన్ మన్ మే ఫికర్...
ఆ పేరు వింటేనే డర్...డర్!! స్వీట్‌లు ఇష్టమని మెక్కకు అతిగా! సుగర్ వచ్చిందని ఖేదపడకు ప్రతిగా!
అతి అనర్థమని తెలుసుకో! సుగర్ కాదొక వ్యాధి ... అది ఒక రుగ్మత! క్లోమగ్రంథి పనితీరు మెరుగైన అది పరార్!
సుగరుందని కాకు బేజార్... యోగా, వ్యాయామాలతో బేఫికర్, నడక, ఆహార మార్పులతో పొందు హమేషా హుషార్!
సుగర్ భావనను తరిమెయ్ జరూర్... మెరుగైన జీవనమే నీకు అసలైన విందు! అదే పసందు!!
**-అల్లూరు శివకోటేశ్వరరావు. 9491708633.**



# సభకో నమస్కారం

కిరణ్ కుమార్ సత్యవోలు
9703222329

**రాజబాబు బస్ దిగి కళ్ళ జోడు సవరించుకుని ఊరివైపు చూసాడు. ఎదురుగా నవ్వుకుంటూ నడుచుకుంటూ వస్తున్న వ్యక్తిని చూసాడు. అతనూ నవ్వుతు "రచనల రాజబాబు అంటే నువ్వేనా?" అడిగేడు.**

**"అవునండి!" అన్నాడు రాజబాబు వినయంగా.**

ఆ వ్యక్తి పరిచయం చేసుకుంటూ– "నేను కథలరావ్. ఇప్పటికి నాలుగొందల పైచిలుకు కథలు, నలభై కింద చిలుకు నవలలు, లెక్క పెట్టలేనన్ని కవితలు, లెక్కేలేని కథానికలు రాసాను." అన్నాడు.

"నిజంగా మీరు సాహిత్యంలో మునిగి తేలుతున్నారు!" అన్నాడు రాజబాబు.

"నిజానికి సాహిత్యంలో మునగడం వరకే మన పని. తేలడం అనేది మన చేతుల్లో లేదు. అయినా సాహిత్యమేమైనా పిల్ల కాలువేమిటయ్యా! సముద్రం." చెప్పేడు కథలరావ్.

"కరెక్టుగా చెప్పారు!" వత్తాసు పలికాడు రాజబాబు.

"అయినా నువ్వు అదృష్టవంతుడివోయ్!... రాసిన మొదటి కథకే బహుమతి కొట్టేశావ్." అన్నాడు కథలరావ్.

"ఎలా రాయాలి, ఎలా రాయకూడదు అనేది ఏదో మీలాంటి వాళ్ళ కథలు చదివి నేర్చుకున్నానండి!" అన్నాడు రాజబాబు ద్వంద్వార్థం వచ్చేలా.

"వెరీ గుడ్! వెరీ గుడ్!! వెళ్దామా సమావేశానికి టైం అవుతోంది." అన్నాడు. ఇద్దరు కలిసి సమావేశం జరిగే ప్రాంతానికి చేరుకున్నారు.

✦✦✦

చిన్న సైజ్ పెళ్ళి మండపంలా ఉన్న ఆ భవనంలో సాహితీ చర్చలు తక్కువగా, సన్మాన సభలు ఎక్కువగా జరుగుతుంటాయి.

అక్కడ రచయితలూ, కవులు, విమర్శకులు, సమీక్షకులు వంటి వారందరూ సమావేశం అయ్యారు.

రాజబాబుకి అంతమందిని చూసేసరికి ఇబ్బందిగా అనిపించింది.

"ఏంటలా చూస్తున్నావ్?" ప్రశ్నించాడు కథలరావ్.

"సముద్రాన్ని!" అన్నాడు రాజబాబు.

కథలరావ్ నవ్వి "సరే...సరే! మన సాహితీ మిత్రులను పరిచయం చేస్తానురా!" అని ముందుకు నడిచాడు. రాజబాబు అనుసరించాడు.

"మాకొక సమూహం ఉంది...దాని పేరు 'కతలు పడదామా!' ఎలా ఉంది?" అనడిగాడు కథలరావ్.

"క్రియేటివ్‌గా ఉందండి. పుట్టుకొచ్చిన కథల కంటే పట్టుకొచ్చిన కథలే ఎక్కువ అన్నట్టు అర్థం స్ఫురించినా పేరు కొత్తగా ఉంది..." అన్నాడు రాజబాబు.

"కరక్ట్‌గా చెప్పావ్." అంటూ భుజం తట్టాడు.

"ఈ సమూహం క్రియేట్ చేసింది నేనే! నేను ఇలాంటి నలభైకి పైగా సమూహాల్లో ఉన్నాను. కానీ కతలు పడదామాకి నేనే అడ్మిన్ని. ఇందులో ఇప్పటి వరకు రెండొందల తొంభై మంది రచయితలు ఉన్నారు. ఇప్పుడు నీతో కలిపి రెండొందల తొంభై ఒకటి." చెప్పేడు కథలరావ్.

ఆయన మాట పూర్తయ్యేలోపు వాట్సాప్ సమూహంలో యాడ్ అయినట్టు... మెసేజ్ వచ్చింది. చూసుకున్నాడు రాజబాబు.


కథలరావ్‌ని చూసి అక్కడ కూర్చున్న కొంత మంది బృందం నవ్వుతూ చేతులూపింది.

"ఇతనే రచనా రాజబాబు!"అంటూ బృందానికి పరిచయం చేసాడు.

"ఎన్ని రాసావ్ ఏంటి?..." అనడిగాడు అందులో ఒక పెద్ద మనిషి.

"నాలుగైదు కథలు రాసుంటానండి."

"నీ వయసులో నేను నలభైపైనే రాసాను." అన్నారొక సీనియర్ సిటిజెన్ రచయిత్రి.



“మీకేంటి మేడం! మీరు పెన్ పేపర్ మీద పెడితే చాలు, అదే ఏదో కథ రాసుకుపోతుంది.” అన్నాడు మరో రచయిత ఆవిడను పొగుడుతూ.

“మరి మన సన్మాన సామ్రాట్‌గారు తక్కువ తిన్నారా?... ఓసారి రాయడంలో ఇన్వాల్వ్ అయిపోయి కాగితం దాటిపోయి బల్ల మీద, గోడల మీద కథలను రాసుకుంటూ పోయారట. ఇప్పటికీ వాళ్ళింటి గోడల నిండా ఆయన రాతలే!” చెప్పాడు పాళి అన్న కలం పేరున్న రచయిత.

“మీరేమైనా తక్కువా? కలం పేరుతో రచనలు చేసి చేసి అసలు పేరు మర్చిపోయారు కదా! అదెంత గొప్ప విషయం. అంత డెడికేటివ్‌గా ఎవరుంటారు చెప్పండి?” అన్నాడు సన్మానం సామ్రాట్ తన మీదున్న శాలువాని సద్దుకుంటూ.

రాజబాబు అందరి మాటలు వింటూ మౌనంగా కూర్చున్నాడు.

సన్మానసామ్రాట్ పక్కనే ఉన్న పెద్ద బ్యాగ్‌ని చూసి – ‘‘అందులో ఏమున్నాయండి? పుస్తకాలా?’’ అనడిగాడు రాజబాబు.

‘‘నాకొచ్చిన శాలువాలు!’’ అన్నాడు సన్మాన సామ్రాట్.

పక్కనే కూర్చున్న మరో రచయిత ముసిముసిగా నవ్వుతూ రాజబాబుని చూసాడు.

“నమస్కారమండి..” అన్నాడు రాజబాబు.

“నమస్తే... నా పేరు బిరుదాంకిత్! ‘సాహిత్య విజ్ఞాన విభాగ విధాన స్వయం ప్రకాశ విభూషణ’, ‘కలంకారి’, ‘సిరాముద్ర’ వంటి నూట యాభై బిరుదులు ఉన్నాయి. తెలుగు సాహిత్య కవిత్వంలో నేను చేసిన ప్రయోగాలు ఎవరు చేసుండరు?” చెప్పేడు.

“గ్రేట్ అండి! మీరు చేసిన గొప్ప సాహిత్య ప్రక్రియ ఒకటి చెప్పండి.” అడిగేడు రాజబాబు కుతూహలంగా.

“అందరు ద్విపద, త్రిపద కవిత్వాలు రాస్తుంటే.. బోర్ కొట్టి ఏకాక్షరి కవిత్వమనే ప్రయోగం చేశాను. ‘ఛీ’ ‘దా’ ‘పో’ ‘లే’ ‘నో’ ‘గో’ఇలా అన్నమాట” చెప్పేడు బిరుదాంకిత్.

“నో, గో ఆంగ్ల పదాలు కదండీ!” ప్రశ్నించాడు రాజబాబు

“తెలుగులో ఒక అక్షరమే కదండీ.” బదులిచ్చాడు బిరుదాంకిత్.

ఫోన్ చూసుకుంటే అప్పటికే రాజబాబుని పదికిపైగా వాట్సాప్ సాహిత్య గ్రూప్‌లో జాయిన్ చేసేసారు అక్కడి వాళ్ళు!

ఇప్పుడు ప్రత్యక్ష పరిశీలనా అనుభవకర్ గారు ప్రసంగిస్తారు అని అనౌన్స్ చేశారు.


ఆయన నవ్వుతూ మైక్ దగ్గరకు వచ్చి–

“సాధారణముగా అందరు రచయితలూ ఊహించి కథలు, నవలలు రాస్తుంటారు. నా దృష్టిలో అవన్నీ కథలు కావు. కల్పనలు అంతే! నేను ప్రత్యక్షంగా పరిశీలించి అనుభవిస్తేగాని దేన్నీ రాయను. నేను స్పృశించేది ఏదైనా నేను అనుభవించేది అయ్యుండాలి అనేది నా అభిలాష... అందుకే నా రచనలు రియాలిటీకి దగ్గరగా ఉంటాయని... అందరూ అంటూ ఉంటారు. రచయిత నాలా పర్ఫెక్షన్ కోసం పాటుపడాలి. కొత్తవాళ్లకు ఇచ్చే సలహా ఇదే!!” అని ముగించాడు.

చప్పట్లు మిన్నంటాయి.

‘ఇప్పుడు వృద్ధాశ్రమ కథల గని – కాగితాల తాతాజీ మాట్లాడతారు’ అని అనౌన్స్ చేసారు.

ఆయన మైక్ దగ్గరకు వచ్చి– “అదేమిటో నేను ఏ కథ రాసినా అది వృద్ధాశ్రమం చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అన్ని కథల్లోను పిల్లలు వదిలేసినా తల్లిదండ్రులు వృద్ధాశ్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారనే అంశమే






నాకు తడుతుంది.... అది నా బలహీనత! మొదట్లో వేరే కథలు రాయాలని చాలా ప్రయత్నించాను. కానీ నా వల్ల కాలేదు. అందుకే ఎప్పుడు పత్రికల్లో పోటీలు పడినా ఒకటే కథను పాత్రల పేర్లు మార్చి ఊరు పేరు, వృద్ధాశ్రమం పేరు మార్చి పంపేస్తుంటాను. టైం బాగుంటే సెలెక్ట్ అయిపోతుంది, అవ్వకపోయినా నష్టం లేదనుకోండి. చిన్నప్పుడు పరీక్షల్లో ప్రశ్న ఏది ఇచ్చినా మనకొచ్చిన ఆన్సర్ రాసినట్టు నేను కూడా ఒకటే కథను పలు మార్లు రాసి నాకంటూ సాహిత్య లోకంలో సుస్థిర స్థానాన్ని ఏర్పర్చుకోగలిగాను. మీరు కూడా ఇలా ఏదో ఒకటి చేసి పేరు సంపాదించాలని కోరుకుంటున్నాను...." అంటూ తన ప్రసంగం ముగించాడు.

చివరిగా బహుమతి పొందిన రాజబాబుని స్టేజ్ మీదకు రమ్మని ఆహ్వానించారు.

బెరుకుగా స్టేజి దగ్గరకు వెళ్ళాడు.

యువకుల సాహిత్య తిలక అన్న బిరుదుని అంటగట్టి ఒక శాలువా కప్పి దింపారు.

చివరిగా ఆ ప్రోగ్రామ్ హెడ్ హల్లు బాబు మాట్లాడుతూ "మన ఆన్‌లైన్ పత్రిక మొదలెట్టిన కొత్తలో ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. నేనొచ్చాక దీనికొక కళను తెచ్చేను... అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. రాయడం వస్తే చాలు మీరు రచయిత అని అందరిలోనూ... స్ఫూర్తిని నింపాను. కథ ఇలానే రాయాలనే రూల్స్‌ని బ్రేక్ చేసాను. అక్షరాలను, పదాలను బ్రేక్ చేస్తూ, బ్రేక్‌డాన్స్ చేస్తూ కూడా కవిత్వ పుస్తకాలు రాయచ్చని నిరూపించాను. నిజానికి నాకు రాయడం ఏమి రాదు... మీలానే నేను ఇన్స్‌పైర్ అయ్యాను... అక్షరాలతో ఆడుకున్నాను. వాక్యాలను వాడుకున్నాను. చదివిన వారు వాక్య నిర్మాణం లేదన్నారు. నిర్యాణం చెందిన వాక్యానికి నిర్మాణం ఏంటని ప్రశ్నించాను. నా జవాబులు కొందరికి అర్థమయ్యేవి కావు. వాళ్ళకున్న ఆలోచనా స్థాయికి నేను దిగలేక వారికేది అర్థమయితే అదే అనుకోమని వదిలేసాను.... ఒక్కోసారి నా సమాధానాలు వారిలో మరిన్ని ప్రశ్నలు కలిగించేవి. నా మిత్రుడు నా కవితలకు ఇచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ చెప్పి, నా ప్రసంగం ముగిస్తాను. 'అతని కవిత్వం అంతే! అర్థమయిన వాళ్ళు చెప్పలేరు. చెప్పగలిగే వాళ్ళు అర్థం చేసుకోలేరు అని!' అని ముగించాడు.

హాల్లో చప్పట్లు మిన్నంటాయి.

మొత్తం విన్న రాజబాబు కళ్ళు తిరిగిపడిపోయాడు.


పది నిమిషాల తరువాత...

కింద పడి పోయి కళ్ళు తెరిచి చూసేసరికి రాజబాబు చుట్టూ కథలరావ్ బృందం నిలబడి చూస్తోంది.

"నాకేమైంది?" అనడిగాడు రాజబాబు.

"ఏమో! సడన్‌గా మూర్ఛ వచ్చి పడిపోయావ్!" అన్నాడు కథల రావ్.

మీ సభకో నమస్కారం అని చెప్పి పారిపోయాడు రాజబాబు



# కళ్లజోడు


DAYAKAR



# గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు

## 2022







**మొదటి బహుమతి**

రూ. 3,500/-లు

గెలుపొందిన కార్టూన్.

కార్టూనిస్ట్-ఎస్.ధీరజ





**రెండవ బహుమతి**

రూ. 2,500/-లు

గెలుపొందిన కార్టూన్.

కార్టూనిస్ట్-శంబంగి




**మూడవ బహుమతి**


రూ. 1,500/-లు


గెలుపొందిన కార్టూన్.


కార్టూనిస్ట్- గాంధీ


# ప్రత్యేక జ్యూరీ బహుమతులు పొందిన 5 కార్టూన్లు


## ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి




**యనమండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, వెంకటలక్ష్మీ స్మారక పురస్కారం-2023**



ప్రముఖ సీనియర్ కార్టూనిస్ట్
శ్రీ గోపాలకృష్ణ గారికి
అభినందన పూర్వక సత్కారం

**గుళ్ళపల్లి అరుణకుమారి స్మారక కార్టూన్ పోటీ విజేతలకు,**
**యనమండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, వెంకటలక్ష్మీ స్మారక పురస్కారం-2023 బహుమతి ప్రదాన సభ**

జనవరి, 26 వతేదీ, గురువారం, విజయవాడ బందరురోడ్డులో రాఘవయ్య పార్క్ ఎదురుగా ఉన్న 'బాలోత్సవ భవన్‌లో' సాయంకాలం 6గంటలకు.



# లెఫ్ట్ ఈజ్ రైట్

కె.వి.సుమలత,
9492656255

**సాయంత్రం ఆఫీస్ నుండి ఇంటికి వెళ్ళేముందు మేనేజర్ గురుమూర్తి నుండి పిలుపొచ్చింది శివాజీకి.**

**ఈ రోజు తొందరగా రండి అన్న శ్రీమతి మాటలు గుర్తొచ్చి 'ఇపుడు ఈయనెందుకు పిలుస్తున్నట్లు' అనుకుంటూ బ్యాగ్ సర్దుకొని క్యాబిన్‌కి వెళ్ళాడు.**

**"రావయ్యా శివాజీ! నువ్వు వెళ్ళేది తార్నాకకే కదూ?"**

**"అవునండి!"**

"నాకో చిన్న పని పడింది. నువ్వు కాదనకుండా చేసి పెట్టాలోయ్!" అన్నాడు జి.ఎమ్.

ఏదో మడత పేచీ కనబడింది శివాజీ కి.

"ఏంటి సర్?" అన్నాడు మింగలేక కక్కలేక.

"మా ఆవిడ వాళ్ళ ఫ్రెండ్ లోచన తార్నాకలోనే ఉంటుంది...ఆవిడ కోసం ఏవో పిండి వంటలు యూ ట్యూబ్‌లో చూసి చేసిందట. అవి ఆవిడ తిని చెప్పేదాకా ఈవిడ నిద్రపోదట. నాకు వేరే పని ఉంది. అటు వెళ్లలేను. ఎటూ నువ్వు అక్కడికే వెళ్తున్నవుగా... ఈ సాయం చేసిపెట్టవోయ్!" ఫిట్టింగ్ పెట్టేసాడు గురుమూర్తి.

"అమ్మో! ఇప్పుడా సర్?... మా ఆవిడ తొందరగా ఇంటికి రమ్మని ఆర్డర్ వేసింది. రేపు తీసుకెళ్తాను!"

"నీ ప్రమోషన్ కోసం పైకి రిఫరెన్స్ పెట్టాలని ఇందాకే అనుకున్నాను. రేపోసారి గుర్తు చెయ్యి!" అంటూ బ్యాగ్‌లో నుండి రెండు కవర్లు తీసి ఇచ్చాడు ఈ డ్యూటీ నీకు తప్పదు అని.

చేసేదేమి లేక అవి బ్యాగ్‌లో పెట్టుకొని అడ్రస్ అడిగాడు శివాజీ.

"లొకేషన్ నీకు షేర్ చేసాను చూడవోయ్!" అన్నాడు బాన లాంటి పొట్టను నిమురుకుంటూ జి.ఎమ్.

లొకేషన్‌లో చూపించినట్లు సూర్యా నిలయం దాకా వెళ్ళాడు శివాజీ. అప్పటికే ఏడు గంటలయింది.

అడ్రస్ మళ్ళీ ఒకసారి సరిచూసుకున్నాడు. అది రెండు పోర్షన్‌ల బిల్డింగ్. కుడి వైపు పోర్షన్ బయట నేమ్ ప్లేట్ ఉంది. జి.సులోచన, నిర్భయ మహిళా మండలి అధ్యక్షురాలు– అని రాసి ఉంది.

ఇదే లోచన గారి ఇల్లు అయి ఉంటుంది అని నిర్ణయించుకున్నాడు. కాలింగ్ బెల్ నొక్కాడు. ఎంతసేపు నొక్కినా సమాధానం లేదు. పోనీ ఎక్కడికన్నా బయటకు పోయారా అని అనుకుందామంటే ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి. ఈ కవర్లు ఇచ్చి తొందరగా వెళ్లిపోవచ్చు అనుకుంటే తలుపులు తెరవరే?...ఒక పక్క దివ్య ఇంకా రాలేదేంటి అని ఫోన్లు చేసేస్తుంది. ఇక లాభం లేదనుకుని తలుపులు దబదబా బాదాడు.

ఓ రెండు నిమిషాల తరువాత ఓ రుబ్బురోలు లాంటి సూర్యకాంతం బయటకొచ్చింది.

"ఎవరు కావాలి?" కరుగ్గా అడిగింది రోట్లో పిండి వేస్తే గర గర లాడినట్లు.

"లోచనగారు ఉండేది ఇక్కడేనా?... నసిగాడు శివాజీ.

"అక్కడ కూర్చోండి. వస్తారు!" అంటూ ఓ కుర్చీ చూపించి వెళ్ళిపోయింది.

తలుపు మూసుకుంది.

శివాజీ కొంగజపం చేస్తూ ఆ వరండాలోని కుర్చీలో కూలబడ్డాడు... చీకటిగా ఉంది. వరండాలో లైటు లేదు. దోమలకు లడ్డు దొరికి నట్లు దొరికి పోయాడు శివాజీ. తలెత్తి చూస్తే సీలింగ్ ఫ్యాన్ ఉంది. స్విచ్ ఆన్ చేశాడు. తిరగ లేదు. అక్కడ స్విచ్ బోర్డుకి ఉన్న స్విచ్‌లన్నీ వేసి ఆపేశాడు. లైటు వెలిగింది కానీ ఫ్యాన్ మటుకు మునిలా నిశ్చలంగా ఉండి పోయింది.

సెకనులు, నిమిషాలు, భయంకరంగా గడిచి పోతున్నాయి. దోమల ఘీంకారం చెవులను ఇబ్బంది పెడుతున్నది. శరీరంలో అచ్ఛాదన



లేని భాగాలను దోమలు పార్టీ చేసుకుంటు న్నాయి. ఎన్నిసార్లు చేతులతో తోలినా, రుమా లుతో కొట్టినా అవి అక్కడక్కడే పచార్లు చేస్తున్నాయి.

శివాజీ తనను, తనకు పని అప్పజెప్పిన జి.ఎమ్ ని తనకొచ్చిన అన్ని భాషల్లో భేషుగ్గా తిట్టుకుంటున్నాడు.

సెల్ లో టైము చూసుకుంటే వచ్చి అప్పుడే గంట దాటింది.

రుబ్బురోలు కానీ, ఆ లోచన అనబడే వ్యక్తి కానీ వచ్చే జాడలు కనపడలేదు. తలుపును గట్టిగా కొట్టాలి అనిపిస్తుంది. కానీ ధైర్యం చాల లేదు. తలుపు తీసి తనను కూర్చోమని చెప్పిన సూర్యకాంతం తను వచ్చినట్లు ఆవిడకు చెప్పిందో లేదో అని అనుమానం వచ్చింది.

బయటకొచ్చి కాలింగ్‌బెల్ నొక్కాడు. రెండు మూడుసార్లు నొక్కిన తరువాత సూర్యకాంతం దొర్లుకుంటూ వచ్చింది.

"ఎవరు కావాలి?" కోపంగా అడిగింది.

"లోచన గారు!" చెప్పాడు శివాజీ మళ్ళీ కొత్తగా అడుగుతుంది ఏంటి అని వింతగా చూస్తూ.

"లోపలికొచ్చి కూర్చోండి" గర గర మంటూ మళ్ళీ అలాగే చెప్పి లోపలికి దొర్లింది.

తలుపు మూసుకుంది.

"ఏమిటిది?" ఏమీ అర్థం కాక జి.ఎమ్‌కి కాల్ చేసాడు.

"ఏమిటయ్యా ఇప్పుడు ఫోన్ చేసావు?" అని గయ్ మని అరిచాడు.


"సర్! ఇక్కడ లోచన గారింట్లో నన్ను కూర్చోమంటున్నారు. ఎవరూ బయటకు రావడం లేదు" మాట పూర్తి కాకుండానే...

జి ఎమ్– "చాలు చాల్లేవయ్యా... కూర్చోడానికి ఏమి నెప్పి? ఇంకా ఆవిడ దగ్గర నుండి ఫోన్ రాలేదని మా ఆవిడ ఎదురు చూస్తుంది... మాట్లాడకుండా కూర్చో" అని టక్కున ఫోన్ పెట్టేసారు.

తొమ్మిది దాటింది... ఆకలి వేస్తుంది. నిద్ర ముంచుకొస్తుంది. చెవుల్లో దోమల సంగీతం! పిచ్చి కోపమొచ్చేస్తుంది... తెగింపు వచ్చేస్తుంది.

మళ్ళీ జి.ఎమ్‌కి కాల్ చేసాడు.

"రాత్రిపూట ఫోన్ చేసి విసిగించ డానికి బుద్ధి లేదా నీకు?" గయ్యి మని అరిచాడు జి.ఎమ్.



"ప్లీజ్ సార్! సార్...నా మాట వినండి సార్! ఆలస్యమై పోతుంది... ఎవరూ బయటకు రావడం లేదు... రేపుదయం ఇవ్వమంటారా?" శివాజీ బ్రతిమిలాడాడు.

"నిన్ను చూసి జాలి పడితే మా ఆవిడ నుండి నన్నెవరు కాపాడుతారు? నీకు ప్రమోషన్ కావాలంటే వెయిట్ చెయ్యి. ఏడుకొండల వాడి దర్శనం కోసం... ఎన్ని గంటలు ఎదురు చూస్తాము? ఇదీ అంతే అనుకో! మళ్ళీ నాకు కాల్ చేసావంటే మాత్రం బాగుండదు!" అని పెట్టేసాడు.

ఈసారి మళ్ళీ కాలింగ్ బెల్ కొట్టాడు శివాజీ. రెండు...మూడు...నాలుగు సార్లకు తలుపు తెరుచుకుంది. సూర్యకాంతం దొర్లు కుంటూ వచ్చి మళ్ళీ– "ఎవరు కావాలి?" గర గర మంటూ అడిగింది.

"రెండు నిమిషాలు... రెండే రెండు ముక్కలు మాట్లాడి వెళ్ళమని లోచన గారికి చెప్పరా ప్లీజ్..." ఏడ్పు గొంతుతో అడిగాడు శివాజీ.

ఒక క్షణం సూర్యకాంతం జాలిగా చూస్తూ– "కూర్చోండి" అని కుర్చీ చూపించింది.

"నేను కూర్చోను అంటే కూర్చోనూ..." మొండిగా అన్నాడు శివాజీ.

సూర్యకాంతం మాట్లాడకుండా దొర్లు కుంటూ వెళ్ళిపోయింది.

అదృష్టం బాగుండి తలుపు తెరుచుకుంది.

శివాజీకి ఓపిక వచ్చింది.

వచ్చింది సూర్యకాంతం కాదు...ములక్కాడ లాంటి ఆకారం రెప రెప లాడుతూ వచ్చింది.

"నమస్కారం మేడం!" అన్నాడు శివాజీ వినయం కంగారు కలగలిపి.

"కూర్చోండి!" అంది మేడం.

"నాకు ఆలస్యం అవుతుందండి... మీరు ఎంతకీ కనబడరు. మీ పనమ్మాయికి కూర్చోండి అనడం తప్ప మరొకటి రాదు. కనీసం కాఫీ కూడా ఇవ్వలేదు!" అన్నాడు.

"పని మనిషి ఎవరు? ఆవిడ మా ఇంటి మనిషి. మా ఇంట్లో సమానత్వంకి విలువలు ఎక్కువ. అయినా కాఫీ కోసం మా ఇంటికి వచ్చారా?" ఆశ్చర్యంగా అడిగింది మేడం.

"అబ్బే కాదండీ! మా జి.ఎమ్‌గారు మీకు ఈ కవర్లు ఇచ్చి రమ్మన్నారు."

"జి.ఎమ్‌గారు ఏంటి?... కవర్లు ఏంటి?... ఎందుకలా తొందరపడుతున్నారు? కొంపదీసి బాంబ్ ప్లాన్ ఏదైనా చేసారా?..." అంది కంగారుగా మేడం.

"అయ్యో! అదేం లేదండీ. జి.ఎమ్‌గారి శ్రీమతి మీ కోసం పిండి వంటలు పంపారట. మీరు తిని చెప్పేదాకా ఆవిడ నిద్రపోరట. తీసుకోండి మేడం... మా ఆవిడ చంపేస్తుంది! ఇప్పటికే ఆలస్యమైంది!" బ్యాగ్‌లో నుండి కవర్లు పట్టుకొని ఏడుపు గొంతుతో అన్నాడు శివాజీ.

"ఏంటీ పిండి వంటలా?..." ఎక్కడ నుండి వచ్చిందో సూర్యకాంతం ఆత్రంగా లటుక్కున శివాజీ చేతిలో కవర్లు అందుకుంది.

"హమ్మయ్యా! ఇచ్చేసాను మేడం. నా పని అయిపోయింది. మీకు ఇచ్చేసినట్లు సాక్ష్యం కోసం చిన్న సంతకం చేయండి!" అని బ్యాగ్‌లో నుండి పేపర్, పెన్ తీసాడు.

"సంతకం పెట్టడం ఏంటి? అసలు మీ

## ఈ నెల 'దినం'

### జనవరి,10-ప్రపంచ నవ్వుల దినోత్సవం








Life Memeber

జి.ఎమ్ గారు ఎవరు? ఆయన శ్రీమతి నాకు పిండి వంటలు పంపడం ఏంటి? ఇదేదో దోపిడీ ముఠాలా ఉంది. నా సంతకంతో బ్యాంక్ అకౌంట్ లూటీ చేద్దాం అని ప్లాన్ చేస్తున్నారా? బయటకు పోతారా? లేక పోలీసులకు ఫోన్ చేయమంటారా?..." అరుస్తుంది మేడం.

"పోనీ! వేలిముద్ర వేస్తారా?" భయం భయంగా అడిగాడు.

"కాలి ముద్ర కూడా వేయను!... అసలు ఇంత రాత్రిపూట వచ్చారు... పిండి వంటలు అంటూ కవర్లు తెచ్చారు... అంటే చాలా పెద్ద స్కాంలో నన్ను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు అనిపిస్తుంది!" అరుస్తూ ఊగిపోతోంది మేడం.

"అయితే ఆవిడని ఫోటో తీసుకుంటాను!" అంటూ రెండు కవర్లు ఒక చేతిలో పట్టుకొని మరో చేతితో లడ్డు తింటున్న రుబ్బురోలు ఫోటో తీసాడు.

"ఫోన్ లాక్కో!" అంటూ అరుస్తున్న ములక్కాడ మేడం మాటలు వినే స్థితిలో సూర్యకాంతం లేదు... తన్మయత్వంగా రెండు చేతులతో తినేస్తుంది.

"నా పని అయిపోయింది!" అంటూ శివాజీ బయటకు పరుగెత్తాడు.

ఆలస్యంగా ఇంటికి వెళ్ళిన శివాజీ తను జి.ఎమ్ వల్ల ఎన్ని బాధలు పడింది భార్యకి చెప్పి కోపాన్ని ఉపశమింపజేసాడు.

✦✦✦

మరునాడు ఉదయం జి.ఎమ్‌చెప్పిన పని చేసి నందుకు విజయగర్వంతో ఆఫీస్‌కి వెళ్ళాడు.

"మీరు రాగానే జి.ఎమ్‌గారు ఆయన ఛాంబర్‌కి రమ్మన్నారు!" అని అటెండర్ చెప్పాడు.

'నన్ను మెచ్చుకోవడానికి అయి ఉంటుంది...' అనుకుంటూ వెళ్ళాడు శివాజీ.


"నీకు చెప్పిన ఒక్క పని కూడా సవ్యంగా చేయ డం రాదా? ఎందుకయ్యా రాత్రంతా మా ఆవిడతో జాగరణ చేయించావు? మా ఆవిడకి నేను ఆల్రెడీ ఇచ్చేసాను అని చెప్పాను. ఆ లోచన పిండి వంటలు అందాయని ఫోన్ చేయలేదట. నేను నిద్రపోయాను. లేవగానే ఆవిడ రాత్రంతా జాగరణ చేసి పడుకుంది. లేస్తుందేమో అని భయంతో ఆఫీస్‌కి తొందరగా పరిగెత్తుకొచ్చాను. అసలు ఇచ్చావా?... లేదా?..." బుసలు కొడుతున్నాడు కోపంతో జి.ఎమ్.

"సర్!... ఇలాంటిది ఏదో జరుగుతుంది అని సంతకం అడిగాను సర్! కానీ ఆవిడ ససేమిరా

# బాలి కార్టూన్‌కి క్యాప్షన్

## డిశంబర్ నెల క్యాప్షన్ ఫలితాలు

**బహుమతి పొందిన క్యాప్షన్**




కొత్తపల్లి సుకుమార్
**8008029359.**

## మరికొన్ని క్యాప్షన్లు

✦ కనీసం కుక్కనైనా బాగుండేది పక్కన కూర్చుండే అదృష్టం దక్కేది....

**-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్**

✦ బోలెడు ప్రేమతో ఆ కుక్కను నీ పక్కనుంచుకున్నావ్...అందులో రవ్వంత ప్రేమను నాపై చూపి నన్ను అటు వేపు కూర్చోనీ కూడదూ...!

**-బొందల నాగేశ్వరరావు, చెన్నై**

✦ కుక్కను నమ్మినట్లు మనల్నెందుకు నమ్మట్లేదు చెప్మా....

**-మన్నవ సాయి రామ భార్గవి ప్రియ,విజయవాడ**

✦ నిన్నేదో రెండుసార్లు తుమ్మానని ఇలా కుక్కను వెంటేసుకురావడం... ఏం బాగాలేదు ప్రియా!

**-దాసరి చంద్రయ్య**

ప్రఖ్యాత చిత్రకారులు, కార్టూనిస్టు శ్రీ బాలిగారు గీసిన ఒక బొమ్మ ఇక్కడ ఇస్తున్నాం. ఈ బొమ్మకి తగ్గట్టు... నవ్వొచ్చేట్లు క్యాప్షన్ రాసి పంపండి. ఉత్తమ క్యాప్షన్‌కి **బాలిగారి కార్టూన్ పుస్తకం బహుమతి!**



బాగుండే కొన్ని క్యాప్షన్లు ప్రచురిస్తాం.

**నిబంధన:** ఒక డైలాగ్ మాత్రమే ఉండాలి. నవ్వు వచ్చే విధంగా రాయాలన్నది ముఖ్య గమనిక!

మీ క్యాప్షన్‌లు చేరవలసిన ఆఖరి తేదీ: **జనవరి, 20.**

ఈ మెయిల్‌కు మీ క్యాప్షన్ పంపండి-

**hasyanandam.mag@gmail.com**.

అన్నారు. అందుకే ఫోటో తీసుకున్నాను" అని ఫోన్‌లో తను తీసిన ఫోటో చూపించాడు.

"ఈవిడ ఎవరు?" ఫోటో చూసి జి.ఎమ్ తుళ్లి పడ్డాడు.

"కంగారు పడకండి సర్! ఆవిడ రుబ్బు రోలు. లోచనమేడం గారి ఇంటిమనిషి. ఆవిడ చేతిలో కవర్లు చూడండి... అదే నేను ఇచ్చాను అనడానికి సాక్ష్యం!" అన్నాడు శివాజీ.


"రుబ్బురోలు ఏంటి? ఇంటి మనిషి ఏంటి? అసలు నువ్వెళ్ళింది లోచన గారింటికేనా?"

"అవును సార్! అక్కడికే వెళ్ళాను. మీరు పంపిన లొకేషన్‌కే వెళ్ళాను... హాల్‌లో కూర్చుంటే దోమలు పీకుతున్నాయి అని బయట లాన్‌లో తిరిగాను. అప్పుడే మీకు ఫోన్ చేసాను. మీరు కోప్పడ్డారు!" చెప్పాడు శివాజీ.

"కొంపదీసి కుడి వైపు పోర్షన్‌కి వెళ్ళావా?" కంగారు ఎక్కువయ్యింది జి.ఎమ్‌కి.

"అవును సర్! అక్కడ రైట్ సైడ్ పోర్షన్ బయట జి.సులోచన అని నేమ్ ప్లేట్ ఉంది. అందుకే అటు వైపు వెళ్ళాను..." ఈ సారి శివాజీకి కంగారు వచ్చింది.

"నీ తెలివి తెల్లారినట్లుంది... లోచన అన్న పేరు ఉన్నవాళ్లు లెఫ్ట్‌సైడ్ పోర్షన్‌లో ఉండ కూడదన్నట్లు మాట్లాడుతున్నావు! కుడి వైపు పోర్షన్‌కి వెళ్లాలా, ఎడమ వైపు పోర్షన్‌కి వెళ్లాలా అని అక్కడకు వెళ్ళాక నన్ను అడగాలి కదా?" దాదాపు అరుస్తున్నాడు ఆయన.





"మీరు నన్ను ఫోన్ చేయొద్దు అన్నారు కదండీ?" బిక్కచచ్చి పోయాడు శివాజీ.

"ఒకసారెప్పుడో మా ఆవిడ చెప్పిన జ్ఞాపకం, లోచనగారి ఇంటి ఓనర్ పేరు సులోచన అని. నువ్వు వెళ్ళింది ఆవిడ దగ్గరికే! వెళ్లవయ్యా బాబు... వెళ్ళు... వెళ్ళూ... వెళ్లి ఆ పిండి వంటలు తీసుకొని లెఫ్ట్ సైడ్ పోర్షన్‌లో ఉన్న లోచన మేడంకి ఇవ్వు. లేకపోతే మా ఆవిడ చంపేస్తుంది మన ఇద్దరినీ..."

"ఇంకెక్కడి పిండి వంటలు సర్? గోడకు కొట్టిన సున్నం... రుబ్బురోలు చేతికి అందిన తిండి వెనక్కు వస్తాయా? కుడి ఎడమైతే పొర పాటు లేదు అని దేవదాసు అన్నాడు కానీ ఇక్కడ ఎడమ రైట్ కుడి రాంగ్ అయ్యాయి సార్!" భోరు భోరున ఏడుస్తున్నాడు శివాజీ.

మధ్యలో ఈ సూర్యకాంతం, ఈ ఇంటి మనిషి, ఈ ములక్కాడ ఏంటో అర్థం కావడం లేదంటే శివాజీలా ఇంటికి వెళ్ళాక తాను ఏడ వాల్సి వస్తుంది అని అయోమయానికి గుర య్యాడు జి.ఎమ్.



# బాపురమణ పురస్కారం-2022 ప్రదానోత్సవం

డిశంబర్,15, 2022 'బొమ్మర్షి' బాపుగారి పుట్టిన్రోజు సందర్భంగా... హైదరాబాద్, పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్శిటీలో బాపురమణ పురస్కారం-2022 సభ ఘనంగా జరిగింది.

బాపురమణఅకాడమీ నిర్వహించిన ఈ సభలో- తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణ, ప్రఖ్యాత నటులు, రచయిత శ్రీ తనికెళ్ళభరణి, ప్రముఖ నటులు శ్రీ విజయచందర్, ప్రముఖ వైద్యులు డా॥ గురవారెడ్డి, ప్రముఖ గాయని శ్రీమతి సునీత ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

బాపు రమణ పేరిట నెలకొల్పిన పురస్కారాల్లో... ప్రముఖ కార్టునిస్ట్ క్యారికేచరిస్టు శ్రీ పామర్తి శంకర్‌గారికి బాపు పురస్కారాన్ని, రచయిత్రి శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి గారికి రమణ పురస్కారాలను అందించారు.

ఈ సభలో శ్రీ ముళ్ళపూడి వెంకట రమణ రచించిన కథా సంకలనాలు- సీతాకల్యాణం, రాధాగోపాలం కథలు, కార్టూనిస్ట్ రామకృష్ణ



ఫౌండేషన్ సమర్పణలో హాస్యానందం ప్రచురించిన రాగతి పండరి కార్టూన్ల సంకలనం పుస్తకం 'నవ్వులవిందు' వక్తలు ఆవిష్కరించారు.

శ్రీ వింజమూరి వెంకట అప్పారావు గారి- బాపురమణీయ లోగిలి అడ్మిన్ శ్రీమతి నిమ్మి మధుబాల- బాపురమణల మధుర స్నేహ పురస్కారాలు డా॥ గురవారెడ్డి, శ్రీమతి రొంపిచర్ల భార్గవి గార్లకు అందించారు.



'కళారత్న' శ్రీ బ్నింగారి పర్యవేక్షణలో, 'కళామిత్ర' శ్రీ వి.సుబ్బరాజుగారి ఆధ్వర్యవంలో, శ్రీపున్నంరాజుగారు సభను ఆసాంతం ఆహ్లాదంగా నిర్వహించారు.







# ఇంటి పేర్లు తెచ్చిన తంటాలు

డా. కేతవరపు రాజ్యశ్రీ,
8500121990

**"అమ్మా! నాకు చాంతాడంత పేరు పెట్టారు. పాస్‌పోర్టులో అసలు నా పేరు ఏమిటో తెలియడం లేదు. కొంతమంది ఇంటిపేరుతో... కొంతమంది సగం కట్ చేసిన పేరుతో... కొంతమంది నువ్వు ఆడా... మగా... అంటూ ప్రశ్నలతో వేధిస్తున్నారు. ప్రపంచంలో ఎన్నో మంచి పేర్లు ఉంటే, మీకు ఇదే దొరికిందా? మా ఫ్రెండ్స్ అందరూ 'ఒరేయ్ నువ్వు తేడా గాడివి రా'... అంటూ ఏడిపిస్తున్నారు!" అంటూ మా అబ్బాయి ఒకటే గొడవ.**

శ్రీమాత లలితాదేవి వరప్రసాదుడిగా పుట్టాడు కాబట్టి మా అబ్బాయికి– 'లలితా కామేశ్వర వరప్రసాద్' అని పేరు పెట్టాము. అయితే పేరు పెట్టేటప్పుడు, బియ్యంలో పేరు రాయిస్తున్నప్పుడు పురోహితుడు ముందర శ్రీ అని రాయాలని చెప్పి 'శ్రీ' అని పైన రాయించి లలితా కామేశ్వర వరప్రసాద్ అని తరువాత నామకరణం రాయించారు మా వారిచేత.

అయితే మా వాడిని బడిలో వేసేటప్పుడు ఎలా జరిగిందో ఏమిటో శ్రీ లలిత కామేశ్వర వరప్రసాద్ అని పడింది.

ఇంతకీ సంగతేమిటంటే... మా వాడి పాస్‌పోర్ట్‌లో ఫస్ట్ నేమ్ దగ్గర 'శ్రీ లలిత' అని, మిడిల్ నేమ్ 'వర ప్రసాద్' అని, లాస్ట్ నేమ్ 'కాస్యపస' అని ఇంటి పేరు పడింది. అది చూసి ఇంటర్వ్యూకి పిలిచిన వాళ్లందరూ తక్కిన పేరంతా చదవకుండా, శ్రీలలితా అని పిలుస్తున్నారు. అది అసలు మా వాడి కోపానికి కారణం.

అమెరికా వెళ్లాలంటే విమానంలో వాళ్ళు ఇచ్చే చిన్న ఫారంలో 'నేమ్' అన్నచోట ఫస్ట్ నేమ్, మిడిల్ నేమ్, లాస్ట్ నేమ్ అని కాలమ్స్ వుంటాయి. వాటిల్లో ఈ పేరు సరిపోక కింద మీద అయినాయి.


నిజానికి మనకి తెలిసిందల్లా మొదట కానీ, చివర కానీ మన ఇంటి పేరు, తరువాత మన పేరు. కానీ ఈ ఫారంలో ఉన్న గళ్ళు అన్ని నింపితే కానీ అమెరికాలో దిగనివ్వడేమో అని భయంతో మొదట ఇంటిపేరు తర్వాత మిడిల్ నేమ్ తర్వాత లాస్ట్ నేమ్ రాయడం జరుగుతుంది.

నా పేరు ధనశ్రీ అయితే మిడిల్‌లో ధన అని లాస్ట్ నేమ్ లో 'శ్రీ' అని పడింది ఏం చేస్తాం? ఇలా చిన్నగా పేరు వున్నా తంటాలే. ఒకతను పాస్‌పోర్ట్‌లో ఇంటిపేరు అన్న చోట, దేవుడు పేరు రాసాడుట. పాస్ పోర్ట్ తొందరగా వస్తుందని. ఈ అమెరికా వెళ్ళడమేమో కానీ, పేర్లతో వచ్చి పడింది తంటా. అసలు ఇంటి పేర్లు చాలా గమ్మత్తుగా ఉంటాయి కొన్ని చిన్నవి కొన్ని పెద్దవి మరీ విచిత్రంగా కర్ర, బుర్ర, నెయ్యి, పప్పు, అలాగే జంతువుల పేర్లు నక్క జింక పిల్లి గుర్రం బల్లి పీత ఇలాంటివి తమాషాగా. కొంత మందిని అసలు ఇంటిపేర్లతోనే పిలుస్తుంటారు కూడా.

అమెరికాకి వెళ్లిన తర్వాత మన పేర్లు ఎలా మారుతాయో!... మాకు ఒక వేలు విడిచిన మేనమామ ఉండేవారు. వాళ్ల ఇంటి పేరు యద్దనపూడి ఆయన పేరు నాగేశ్వరరావు అయితే ఆ రోజుల్లోనే అమెరికా వెళ్లడంతో అంత పెద్ద పేరు పిలవడం వాళ్ళకి చేతకాక మిస్టర్ 'వైన్' అని పిలిచేవారు... మేము కూడా 'వైను' మామయ్య అని పిలిచేవాళ్ళం. మా అమ్మమ్మ "వీళ్ళ నోళ్ళు పడిపోనూ! అదేమిటిరా! సుబ్బరంగా నాగేంద్రుడి పేరు పెట్టుకుంటే మంచిదని, 'నాగేశ్వరరావు' అని పెట్టుకుంటే, తాగుబోతును పిలిచినట్టు 'వైను' అని పిలవడం ఏమిటి? వీడి పిండాకూడు' అనేది.

నవ్వుకునే వాళ్ళం మేము.

కొన్ని ఇంటి పేర్లతో తమాషాలు ఇలా ఉంటాయి... మా వీధిలో ఒకాయన జగడం జగన్నాధం అని ఉండేవారు. వాళ్ళ ఇంటి పేరు



జగడం. ఎప్పుడు సీరియస్‌గా పిలిస్తే కసురు కునే వాడు. ఆయనని చూసి పెద్దవాళ్ళంతా అసలే ఆయన ఇంటిపేరు జగడం ఆయన జోలికి ఎవరూ వెళ్ళకండి అనేవాళ్ళు. మా అమ్మకి వేలు విడిచిన మేనత్త వాళ్ళ ఇంటిపేరు శకునాల. ఆ ఊరిలో ఎవరు బయటకు వెళు తున్న, ఈవిడ ఎదురుపడితే ఏమవుతుందో ఏమో అని భయపడేవారు. నిజానికి ఆవిడ శకునం కొన్నిసార్లు మంచే జరిగినా, ఎందు కైనా మంచిదని ఒకసారి వెనక్కి వెళ్లి మళ్లీ తిరిగి వచ్చేవారు... ఇలా ఇంటి పేర్లు ఉన్న వాళ్ళ తంతు చెప్పనక్కరలేదు మరి.

కాదేది కవిత కనర్హం అన్నట్టు... కాదేది ఇంటి పేర్లకు అనర్హం అన్నట్టుగా, జంతువుల పేర్లు, ఆహార పదార్థాల పేర్లు, ఊర్ల పేర్లు, పంచభూతాలతో మొదలై మధ్యాహ్నం, పట్ట పగలు, చీకటి, సంధ్యావందనం మొదలైనవి కూడా ఇంటిపేర్లు అయినాయి.

మా వారి స్నేహితుడి పేరు పులి వెంకట రెడ్డి. పెద్ద మీసాలు పెంచి, వాటిని మెలేస్తూ పులి లాగే వుండేవాడు. ఒకరోజు ఆయన క్షవరం చేయించుకుంటే, గడ్డంతో పాటు పొర పాటున మీసం కూడా తీసేశాడు ఆ క్షురకుడు. ఇంకేముంది వాడి మీద పులిలా గాండ్రించి పరువునష్టం దావా వేస్తానని విరుచుకు పడ్డాడు పులి వెంకటరెడ్డి. ఆయన మీద కోపంగా ఉన్న వారందరూ లోపల సంతోష పడుతూ– "ఏమిట్రా పులిలా ఉండేవాడివి...పిల్లిలా మారి పోయావు!" అంటూ ఆటపట్టించేవారు.

మా అక్కయ్య ఆడపడుచు వాళ్ళ ఇంటి పేరు 'కొత్త ఆవకాయ'. ఆ పేరు వినగానే మా అందరికీ ఒకటే నవ్వు. ఇలాంటి ఇంటి పేర్లు కూడా ఉంటాయా... అని! ఒకసారి వాళ్ళింట్లో ఏదో వ్రతం చేసుకుంటూ మా అక్క వాళ్ళతో బాటు మమ్మల్ని కూడా భోజనానికి పిలిచారు వాళ్ళు.


"భోజనాలలో మనవాళ్లే కదా అని ఎక్కువ పదార్థాలు చేయలేదు. పది రకాలు చేస్తే అన్ని సగం సగం తిని విస్తట్లో వదిలేస్తారు. అందుకే మామూలు వంట చేశాను. ఏమీ అనుకో కండి!" అంటూ అవిడ పప్పు కూర పులుసు వడ్డించారు. అన్ని బానే ఉన్నాయి. పచ్చాళ్ళ దగ్గరకు వచ్చేసరికి 'పాత గోంగూర పచ్చడి', పాత ఆవకాయ వడ్డించారు... ఆవకాయ కొంచెం నల్లబడి ఎండినట్టుగా ఉంది. నేను, మా తమ్ముడు మొహా మొహాలు చూసుకొని నవ్వుకుంటూ, చెవులో రహస్యంగా వీళ్ళ ఇంటి పేరు 'కొత్త ఆవకాయ'...వేసింది మాత్రం పాత ఆవకాయ అనుకుంటూ నవ్వుకున్నాము.

మా అక్కయ్య "ఇష్!... నవ్వకండి మా ఆడ పడుచు వింటే బావుండదు!" అంది.

ఇంటికి వచ్చి ఆ విషయం చెప్పుకొని పడి పడి నవ్వుకున్నాము.

అలాగే 'దేగల' ఇంటి పేరు అబ్బాయికి... 'చిలుక' అనే ఇంటి పేరు వున్న అమ్మాయిని ఇవ్వడానికి భయపడే వాళ్ళు వున్నారు.

ఇదండీ ఇంటి పేర్లు తెచ్చిన తంటాలు.





# నెల నెలా నవ్వుల వెన్నెల




**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం మీద** హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.

## ఈ నెల అంశం- న్యూ ఇయర్
















## ఆ రెండో పుస్తకం

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

తర్కారావ్ కాస్త గొంతు సవరించుకుని- "ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ ఇంటర్వ్యూ ఉండటంతో... తేగ తింటూ, తెగ బుర్ర బద్దలు కొట్టుకుంటూ, ఆ కంపెనీ తాలూకూ వివరాలూ, ఏ ఏ ప్రశ్నలకి ఏ జవాబులు అడుగుతారూ... అవి ఎలా చెబితే బావుంటుందీ... అని కంప్యూటర్ ముందు కూర్చుని... గూగుల్‌ని ఉతికి ఆరేసి మరీ వెతికి పట్టుకున్నాడు మధు.

తర్వాత ఆ సమాచారాన్ని తన వర్డ్‌పేడ్ పై సేవ్ చేసుకున్నాడు. అయితే తనతో పాటు, తన స్నేహితుడు పిల్లబాబుకి కూడా అదే కంపెనీలో రేపు ఇంటర్వ్యూ ఉంది.

అయితే, అతను కొంత తింగరోడే అయినా, ఏ మట్టిలో ఏ మాణిక్యం ఉంటుందో మనం కంటితో కనిపెట్టలేం. ఒక్కోసారి తింగరోళ్ళలా కనిపించిన వాళ్ళే, రేపు జీవితంలో పందెం కోళ్ళలా దూసుకుపోతారు. కనుక ఓసారి వాడ్ని కెలుకుదాం అని పక్కనున్న ఫోన్‌లో అతని నెంబర్ పై ఒక్క నొక్కు నొక్కాడు.

లిఫ్ట్ చేసీ చేయడంతోనే- "ఏరా మధూ! రేపు ఇంటర్వ్యూకి ఏవైనా హెల్ప్ కావాలా" అంటూ అడిగాడు.

దాంతో మధుకి తల తిరిగినట్లైంది.

కానీ తమాయించుకుని, సరే అని అతని అహం పక్కన పెట్టి, ఎంత ప్రిపేరైనా కొంత భయంగా ఉంటోందని చెప్పాడు. మరి నీ పరిస్థితి ఏంటని అడిగాడు, కాస్త గుట్టు లాగుదామని.

దానికి పిల్లబాబు కాస్త తేలిగ్గా, నేను ఇంటర్వ్యూకి సంబందించిన రెండు పుస్తకాలని కొన్నాను. కాబట్టి ఇంటర్వ్యూ నేను పూర్తిగా పాసై పోతాను అని ధీమాగా చెప్పాడు.

ఆ మాటలకి మధు కొంత ఉత్సాహంగా- 'ఆ పుస్తకం పేర్లు చెప్పరా నేను ఇప్పుడే వెళ్ళి కొని తెచ్చుకుంటాను' అంటూ ఆశగా అడిగాడు.

కొంతసేపు ఆలోచించాక, సరే 'హౌటు ఫేస్ ఇంటర్వ్యూ' చెప్పాడు కాస్త ఇబ్బందిగా.

"మరి ఆ రెండో పుస్తకం?" అడిగాడు మధు ఆశక్తిగా.

"అది నేను చెప్పలేనురా! సారీ" అని ఫోన్ పెట్టేసాడు పిల్లబాబు.

దాంతో, అప్పటి వరకూ ప్రశాంతంగా ఉన్న మధు, ఒక్కసారే మల్ల గుల్లాలు పడిపోయాడు. ఎందుకో ఇంట్లో ఊరికే కుర్చీలో కూర్చోబుద్ధి కాలేదు. ఆ రెండో పుస్తకం మంచి మెటీరియల్లే అయింటుంది, దాని పేరు చెబితే ఆ ఇంటర్వ్యూలో నేను వాడ్ని మించిపోతానని వాడి కుళ్ళు కాబోలు. అది నేను ఎలాగైనా తెలుసుకుని తీరాలి. రేపు గబుక్కున వాడు సెలెక్ట్ అయిపోయి, నేను సెలెక్ట్ కాకపోతే, మా ఇంట్లో నా పరువు, పరువులా పర్రున చిరిగిపోతుంది. కనుక తుర్రున వెళ్ళి... వాడు గుర్రుగా చూసినా సరే, ఆ రెండో పుస్తకం ఏవిటో ఎలాగైనా తెలుసుకుని మరీ కొనేసుకోవాలి అనుకుంటూ స్కూటర్ పై బయలుదేరి పిల్లబాబు ఇంటికి వెళ్ళాడు.

కొంత సేపు మాటా మంతీ అయ్యాక, ఆ రెండో పుస్తకం అంటూ అడిగాడు మధు.

అతని మాటలకి కాస్త అసహనంగా చూసిన పిల్లబాబు, ఆ రెండో పుస్తకం గురించి నేను చెప్పనని చెప్పాక కూడా మళ్ళీ నువ్వు చెప్పమని అడగడం ఏమైనా బావుందా చెప్పు అన్నాడు విసుగ్గా.

"ప్లీజ్ అలా అనకురా...చెప్పు!" అడిగాడు మధు బ్రతిమాలుతున్నట్టు.

"సరే ఏడవకు ఇదిగో!"అంటూ 'హౌటు ఫేస్ ఇంటర్వ్యూ' పుస్తకాన్ని అతని చేతిలో పెట్టాడు పిల్లబాబు.

"నేను అడిగింది మొదటి పుస్తకం కాదురా. రెండోది!" అంటూ అడిగాడు మధు.

ఇది రెండోదే, మొదటిది ఇదిగో అని అచ్చం అదే పుస్తకం ఇంకోటి తీసి చూపించాడు. దాంతో మధు, కాస్త అయోమయంగా చూస్తూ, ఒకేలాంటివి రెండు పుస్తకాలు ఎందుకు కొన్నావ్ అంటూ బిక్క మొహంతో అడిగాడు.

దానికి పిల్లబాబు చెప్పిన సమాధానం విని, తలతిరిగి వెనక్కి పడి పోయాడు మధు.

"ఇప్పుడు చెప్పు సుబ్బారావ్! అతను ఒకేలాంటి రెండు పుస్తకాలు ఎందుకు కొన్నాడని చెప్పుంటాడు." అడిగాడు తర్కారావ్.

"సింపుల్ సార్! ఒకటి ఇంట్లో చదువుకోవడానికి, రెండోదాన్ని చింపి స్లిప్పుల్లా ఆ ఇంటర్వ్యూకి పట్టుకెళ్ళడానికయ్యింటుంది సార్!" చెప్పాడు నమ్మకంగా.

"కాదు తమరి బొంద! వాళ్ళ జాబ్ కన్సెల్టెన్సీ ట్రైనర్, ఆ పుస్తకం ఒకటి చేతిలో ఉంటే చాలూ, సగం జాబ్ ఇంటర్వ్యూ పాసయిపోయినట్టే అన్నాడట. దాంతో రెండు కొనేసాడు పిల్లబాబు. అదీ జరిగింది. నువ్వు చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు!" అని తర్కారావు చెప్పగానే...

"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్థం చేసుకోరు కదా!..." అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావ్.




**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె. ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలనుకుంటుంటాడు. ఆంధ్ర కుర్రాడ్రు చందుని ఇష్ట పడుతుంది ఇందు. అయితే ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే ఇందునిచ్చి పెళ్ళి చేయాలనుకునేందుకు కారణం వంద సంవత్సరాల గతంలోకి వెళ్ళాల్సిందే... అలా వెళ్ళాక... సుబ్బారావు. అప్పన్నలు పోలీస్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్ వెళతారు. గోల్కొండ కోట దగ్గర్నుంచి ఒక పొట్టి వ్యక్తి వీళ్ళను వెంబడిస్తుంటాడు. సుబ్బారావు, అప్పన్నలు ఒక పార్టీకి వెళతారు. అక్కడోహత్య జరిగి, ఒక నక్లెస్ దొంగిలించబుతుంది... పోలీసులు ఎన్‌క్వైరీ చేస్తుంటారు.

ప్రస్తుతం...

**"ఎవడు వీడు?" అడిగాడు ప్రధాని.**

**"వీడికి ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు మూడు భాషలు తెలుసు సార్! పేరు శ్రీరామశాస్త్రి. ట్రాన్స్‌లేటర్ కోటాలో పార్టీకి హాజరయ్యాడు!" చెప్పాడు సైన్యాధ్యక్షుడు.**

**"నేరం ఒప్పుకున్నాడా?" అడిగాడు ప్రధాని.**

**"ఇంకా ఒప్పుకోలేదు సాబ్! కానీ, వీడు బాకు విసరడం చూసిన వారు, వీడు పరుగెత్తుతుంటే... వీడి చేతిలో వజ్రాల నెక్లెస్ చూసిన వారు నలుగురు సాక్షులు ఉన్నారు. వీడి దగ్గర నెక్లెస్ దొరకలేదు సాబ్!" చెప్పాడు సైన్యాధ్యక్షుడు.**

**ప్రధాని, ఆ దొంగ వైపు తిరిగి- "ఆ నెక్లెస్ ఎక్కడుందో చెబితే... నిజాం రాజు గారితో మాట్లాడి, నీకు తక్కువ శిక్ష పడేలా చూస్తాను!" అన్నాడు.**

"ఆ నెక్లెస్ నేను కాజేసిన మాట వాస్తవం. కానీ, అది నా దగ్గర లేదు!"అన్నాడు.

"మరి ఎక్కడుంది?"

"తెలియదు!"

"అసలు నువ్వెందుకు ఆ నెక్లెస్ కాజేయా లనుకున్నావ్?"

"అది ఈ దేశ సంపద! ఈ దేశ సంపదను విదేశీయులు దోచి, వేరే రాజ్యాలలో ఉన్న తమ బంధువులకు బహుమతులుగా ఇస్తుంటే... చూస్తూ ఉండలేకపోయాను!" అన్నాడు శ్రీరామశాస్త్రి.

"ఓహ్! దేశభక్తుడివా?... భాష చూస్తుంటే...

మా ప్రాంతం వాడిలా లేవే!"

"........."

"ఇంతకూ ఆ నగ ఎక్కడుంది?"

"చేరాల్సిన చోటికి చేరి ఉంటుంది!"

"అదే...ఎక్కడికి?" అడిగాడు ప్రధాని.

✦✦✦

పోలీసు ట్రైనింగ్ కోసం వచ్చినవాళ్ళను, భారీ వాహనంలో వికారాబాద్ అడవుల్లోకి తర లించారు. అడవిలో క్యాపింగ్ వేసారు.

ఏ ఏ పోలీసులు అడవిలో ఏం చెయ్యాలో, ఎటు వైపు వెళ్లాలో...బ్రిటీష్ అధికారులు వాళ్లకు డ్యూటీలు వేసారు.

పెద్ద పెద్ద చెట్లు ఎక్కడం... అడవిలో చెట్ల మధ్యలో నుండి పరుగెత్తడం... అడవిలో దూరాన వస్తున్న మనుషుల జాడను... శబ్దాన్ని బట్టి గుర్తుపట్టడం...ఇలా ట్రైనింగ్ ఇవ్వడం మొదలుపెట్టారు.

బాగా అలసిపోయి, అందరూ తమ టెంట్ లోకి వచ్చారు.

కొందరు ఆ రాత్రి కూడా అడవిలో నైట్ డ్యూటీ చేస్తూ... అడవిలో చీకట్లకు అలవాటు పడుతున్నారు.

ఆ అడవిలోకి, నల్లటి దుస్తులలో ఉన్న ఒక వ్యక్తి, సాధ్యమైనంత నిశ్శబ్దంగా నడుస్తూ వస్తు న్నాడు. అర్ధరాత్రి, డ్యూటీ చేస్తున్న పోలీసులలో ఒకతను ఆ చీకట్లోనే, ఆ నల్ల దుస్తుల వ్యక్తి దగ్గరికొచ్చాడు.

ఆ పోలీసు, ఆ నల్ల దుస్తుల వ్యక్తికి, తన దుస్తులలో నుండి 56 వజ్రాలున్న నెక్లెస్‌ను తీసి ఇచ్చాడు.



ఆ నల్ల దుస్తుల వ్యక్తి వడివడిగా చీకట్లో కలిసిపోయాడు.

పోలీసు వెనక్కి తిరిగి చూసేసరికి, వెనక షాకై చూస్తున్న సుబ్బారావు నిలబడి ఉన్నాడు.

"అప్పన్న... అంటే, మీరు, నువ్వు... ఆ వజ్రాల నెక్లెస్ దొంగిలించిది నువ్వా? ఇప్పుడది ఎవరికి ఇచ్చావ్?... అసలు ఎలా దొంగిలించావ్? దొంగ దొరికాడు అన్నారే? దొరికినోడు... దొంగ కాదా! నువ్వా ఆ దొంగవు!" అన్నాడు సుబ్బారావు.

"ష్!"అన్నాడు అప్పన్న.

✦✦✦

"నెక్లెస్ ఎక్కడ దాచావ్?" మళ్ళీ అడిగాడు ప్రధాని.

"చెప్పానుగా! చేరాల్సిన చోటికి చేరిందని!" అన్నాడు శ్రీరామశాస్త్రి.


"మా సంగతి నీకు తెలియదు. ఆ నెక్లెస్ ఎక్కడుందో చెప్పించే వరకు వదిలిపెట్టం!" అన్నాడు ప్రధాని.

శ్రీరామ శాస్త్రి పగలబడి నవ్వాడు..."నువ్వే వదిలిపెడతావ్!"

"ఏంటి నీ నమ్మకం?" అడిగాడు ప్రధాని.

ఈ లోపు, ఒక సైనికుడు వచ్చి- "బ్రిటీష్ అధికారులు వచ్చారు సర్!" అన్నాడు.

ప్రధాని ఆ గది నుండి బయటకు వచ్చే సరికి, ఇద్దరు బ్రిటీష్ అధికారులు, నలుగురు బ్రిటీష్ పోలీసులు ఉన్నారు. సైన్యాధ్యక్షుడు కూడా ప్రధాని వెనకే బయటకు వచ్చాడు.




ప్రధాని ఏమిటన్నట్టు చూసాడు.

"ట్రాన్స్‌లేటర్ శ్రీరామశాస్త్రి మా మద్రాస్ ప్రెసిడెన్సీ మనిషి. మీ రాజ్యం వాడు కాదు... అతడిని మాకు అప్పగించండి!" అన్నాడు బ్రిటీష్ అధికారి.

"అతడు... మా రాజ్యంలో దొంగతనం చేసాడు!" అన్నాడు ప్రధాని, కాస్త చిరాకుగా.

"అవన్నీ మాకు తెలియదు. మీరు అతడిని, మా ఏరియాలో అరెస్ట్ చేసారు... అందుకే మాకు అప్పగించండి!" అన్నాడు బ్రిటీష్ అధికారి.

ప్రధాని తమ సైన్యాధ్యక్షుడి వంక చూసాడు.

"జౌను సాబ్! నిన్న రాత్రి పార్టీలో అనుమానితులుగా కనిపించిన వారిని రాత్రంతా మన సైనికులు వెతుకుతున్నారు. ఆ సుబ్బారావు, అప్పన్న అనే పోలీసులు పార్టీ నుండి కంటోన్మెంట్ ఏరియాకు వెళ్ళి, వాళ్ళ టెంట్స్‌లో నిద్ర పోయారు. అలాగే మరి కొందరు అనుమానితులను వెంబడించాం. హుస్సేన్‌సాగర్‌కు అవతలి వైపు శ్రీరామశాస్త్రి అనే వాడు దొరికాడు... మమ్మల్ని చూసి వాడు కంగారు పడడం, వాడి వాలకం చూసి అరెస్ట్ చేసాం. గంట క్రితమే సాక్షుల విచారణ పూర్తయింది. వీడు బాకు విసరడం ఒకరు చూసారు. వాడి చేతిలో నెక్లెస్‌ను కూడా ముగ్గురు మహిళలు గమనించారు!" చెప్పాడు సైన్యాధ్యక్షుడు.


"విన్నారుగా..." అన్నాడు ప్రధాని.

"అవన్నీ మాకు తెలియదు. మాకు అతడు కావాలి. చట్ట ప్రకారం, మీరు మా ఏరియాలో అరెస్టులు చేయడానికి వీల్లేదు!..." అన్నాడు బ్రిటీష్ అధికారి.

ప్రధాని, పక్క గదిలోకి వెళ్ళి... నిజాం రాజుకు సందేశాన్ని పంపాడు.

అరగంటలో... నిజాం రాజు నుండి, ఒకడు సందేశాన్ని ఉత్తరం రూపంలో మోసుకొచ్చాడు.

"ఆ బ్రిటీష్ వారితో మనకెందుకు గొడవ. ఆ నెక్లెస్ పోతే పోయింది. ఆ శ్రీరామశాస్త్రిని వదిలెయ్యండి. ఈ విషయం, నేను వచ్చే నెలలో బొంబాయిలో జరగబోయే మీటింగులో లండన్ నుండి వచ్చే బ్రిటీష్ ఉన్నతాధికారు



లతో మాట్లాడతాను!" ఇదీ సారాంశం.

"మీరు అతడిని తీసుకెళ్ళొచ్చు." అన్నాడు ప్రధాని అయిష్టంగానే. బ్రిటీష్ వారు, శ్రీరామశాస్త్రిని, విడిపించుకుని తీసుకెళ్ళిపోయారు.

వాళ్లు, వెళ్లిపోయాక... రెండవ ఉత్తరాన్ని తీసి ప్రధాని చేతిలో ఉంచాడు వార్తాహరుడు.

"ఆ శ్రీరామశాస్త్రిగాడి వివరాలు, విషయాలు కనుక్కోవడానికి పది మంది గూఢచారులను నియమించు. అవసరం ఐతే ఆంధ్రాలో వాడిది ఏ ఊరో, వాడి మిత్రులెవరో, వాడి వివరాలేమిటో పూర్తిగా కనుక్కోండి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ నెక్లెస్ జాడను మనం కనిపెట్టాలి!..." ఇది సారాంశం.

"బహుశా ఆ శ్రీరామశాస్త్రిగాడిని, బ్రిటీష్ కుక్కలే ఈ దొంగతనానికి పంపి ఉంటాయి. బహుశా ఆ నెక్లెస్ వాడి నుండి తీసుకుని, లండన్ పంపుతాయి. ఆ తర్వాత, ఆ నెక్లెస్ లండన్ రాణిగారి మెడలో మెరుస్తుంది!" అన్నాడు సైన్యాధ్యక్షుడు కోపంగా.

'ఎవరి సొమ్ము ఎవడ్రా దోచేది! మొత్తం ఈ దేశపు సొమ్మేగా?.. ఐతే మీరు, లేదా వారు ఎవరో ఒకరు మా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు మాకు ఈ తిప్పలు తప్పవు!' అనుకుంది, పైన వెంటిలేటర్ లో కూర్చొని, ఈ సంభాషణంతా వింటున్న ఓ పావురం.

✦✦✦

ఆ అడవిలో, సుబ్బారావు పోలీస్ దుస్తులలో ఒక మర్రిచెట్టు కింద నిలబడి ఉన్నాడు.

అప్పన్న పోలీస్ దుస్తులలో, ఆ మర్రిచెట్టు కొమ్మ మీద కూర్చుని ఉన్నాడు.

పై కొమ్మ మీద రెండు కోతులు కూర్చొని, వీళ్ల వంక ఆసక్తికరంగా చూస్తూ.. కిచ్ కిచ్చ్ కిచ్చ్ కిచా కిచ్... అని శబ్దం చేసాయి.

"ఏదో ఒకటి మాట్లాడి చావండ్రా నాయనా!... అలా సీరియస్‌గా మొహామొహాలు చూస్తూ ఎంతసేపు ఉంటారు?" అని ఒక కోతి శబ్దానికి అర్థం.

"వీళ్ల వాలకం చూస్తుంటే, ఏదో పెద్ద విషయమే ఉంది రోయ్! మన కుటుంబాన్ని మొత్తం పిలుద్దామా?" ఆసక్తికరంగా వింటారు!" ఇది రెండో కోతి మాటలకు అర్థం.

"వద్దులే... అదిగో ఏదో మాట్లాడుతున్నారు. విను విను.." అంది మొదటి కోతి.


సుబ్బారావు గొంతు సవరించుకొని,"ఎందుకు చేసారు ఈ పని?" అన్నాడు సీరియస్‌గా.


అప్పన్న సమాధానం చెప్పే లోపే, మొదటి కోతి, రెండవ కోతితో అంది–"ఏం పనో... మనకు వివరిస్తే బాగుండేది."

"విను! అదే అర్థం ఔతుంది." అంది ఇంకో కోతి.

"నేనసలు ఈ ట్రైనింగ్‌కు వచ్చిందే ఆ వజ్రాల హారం కోసం!" అన్నాడు అప్పన్న.

సుబ్బారావు షాక్ అయిపోయి చూసాడు. **(సశేషం)**



శ్రీ దండెంరాజు ఫౌండేషన్
సమాజం ✦ సాహిత్యం ✦ సౌజన్యం

# మినీ హాస్య కథల పోటీ



## శ్రీ దండెంరాజు ఫౌండేషన్, బెంగళూరు

స్థాపక నిర్వాహకులు
డా|| డి.ఎన్. వి. రామశర్మ గారి సౌజన్యంతో
ఉగాది సందర్భంగా హాస్యానందం నిర్వహిస్తున్న

## ఈ మినీ హాస్యకథల పోటీకి అందరికీ ఆహ్వానం!

**1000 రూపాయలు చొప్పున**
**15 కథలకు బహుమతులు & ప్రశంసా పత్రం**

**అంశం: అమ్మాయే నవ్వితే...**



**నిబంధనలు:**

- మహిళల్ని కించపరిచే విధంగా కథలు ఉండకూడదు.
- డి.టి.పి. చేసి పంపేవారు A4 పేజీ దాటరాదు.
- వ్రాతప్రతి రెండు A4 పేజీలు దాటరాదు.
- సున్నితమైన హాస్యంతో పాటు ఏదైనా సామాజిక అంశం ఉంటే బాగుంటుంది. కొసమెరుపు హాస్యకథలకి ప్రాణం కాబట్టి ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది.
- కథ ఇంతకు ముందు ఎక్కడా ప్రచురించబడలేదనీ, ఏ పత్రిక పరిశీలనలో లేదనీ, కాపీ కాదనీ హామీ పత్రం ఇవ్వాలి.
- మీ కథల చివరి పేజీలోనే హామీ పత్రం, చిరునామా రాయాలి. విడిగా పంపకండి
- బహుమతి పొందిన కథలు హాస్యానందం **మార్చి, 2023** సంచికలో ప్రచురించబడతాయి.
- బహుమతి ప్రదానోత్సవ సభ విజయవాడలో నిర్వహించబడుతుంది. వివరాలు మార్చి సంచికలో.

మీ కథలు ఈ కింది మెయిల్‌కి పంపవలెను.

**hasyanandampoteelu@gmail.com**

కథలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ: **జనవరి-30, 2023**

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం 2023 సందర్భంగా కార్టూన్ పోటీలు



శ్రీ తలిశెట్టిరామారావు జయంతి మే,20,
తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా
డా॥ కె.వి.రమణగారి ఆశీస్సులతో
హాస్యానందం నిర్వహిస్తున్న
ఈ కార్టూన్ పోటీలో
మన కార్టూనిస్టులు పాల్గొని
విజయవంతం చేయాలని కోరుతూ...

| | | |
|---|---|---|
| మొదటి బహుమతి | - ₹ 10,000/- | + ప్రశంసా పత్రం + జ్ఞాపిక |
| రెండవ బహుమతి | - ₹ 6,000/- | + ప్రశంసా పత్రం + జ్ఞాపిక |
| మూడవ బహుమతి | - ₹ 4,000/- | + ప్రశంసా పత్రం + జ్ఞాపిక |
| విశిష్ట బహుమతులు (20) | - ₹ 1,000/- | + ప్రశంసా పత్రం |

నిబంధనలు: ✦ సబ్జెక్ట్ మీఇష్టమే ✦ అశ్లీల కార్టూన్లు పంపవద్దు ✦ ఒకరు 4 కార్టూన్లు మాత్రమే పంపాలి ✦ పరిశీలనలో ఉన్నవి, కాపీ కార్టూన్లు పంపవద్దు ✦ కార్టూన్ అటాచ్ చేసేటప్పుడు మీ పేరు ఫోన్ నెంబరు తప్పనిసరిగా రాయాలి ✦ ఫలితాలు హాస్యానందం మే,2023 సంచికలో ప్రచురించబడుతుంది.

## బాపురమణ కార్టూన్ పురస్కారం-2023

2022 జనవరి నుండి 2023 జనవరి దాకా ఏ మీడియాలోనైనా మీరు వేసిన కార్టూన్లోంచి మీకు బాగా నచ్చిన కార్టూన్ ఒక్కటంటే ఒక్కటి పంపిస్తే వాటిల్లో ఒక దానికి బాపు రమణ పురస్కారం ఇస్తూ సన్మానించాలని నిర్ణయించాం!
**8000 రూపాయల పురస్కారం**తో పాటు... ప్రశంసా పత్రం, సత్కారం.

## శేఖర్ అవార్డు- 2023





ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ శేఖర్ పేరిట నిర్వహిస్తున్న **శేఖర్ అవార్డు 2023** కార్టూన్ పోటీకి **'నేటి చదువులు'** అనే అంశంతో కార్టూన్లు ఆహ్వానిస్తున్నాం!
**10,000 రూపాయల పురస్కారం**తో పాటు ప్రశంసాపత్రం, మెమెంటో.

**కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరి తేదీ 1, ఏప్రియల్, 2023**

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపవలెను- hasyanandampoteelu@gmail.com

Hasyanandam January-2023. RNI No. APTEL 08387/01/1/2003-TC



చవకబారు వస్తువులు విలువైనవి
కావు...
విలువైన వస్తువులు చవకగా
ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548